ఉపన్యాసములు

(మొదటి భాగము)



కృత్తివెంటి
వెంకటసుబ్బారావు.



విద్యార్థులకు వెల రు. 0-12-0 ఇతరులకు రు. 1-0-0.

పోస్టేజీ వేఱు.

రాజన్ ఎలెక్ట్రిక్ ప్రెస్, రాజమండ్రి.

విజ్ఞప్తి.

'Poetry is criticism of life'

Arnold.

ఈ వ్యాసములు కొంతవఱకు చారిత్రకములు. కొంతవఱకు వైమర్శకములు. ఇందు మొదటిరెండును 1930 సం॥ అక్టోబరు ప్రాంతమున రచించి యుపన్యసించినవి. మూఁడవది కాకినాడ కాలేజీలో లెక్చరరుగా నున్నపుడు (1931 అక్టోబరు ప్రాంతమున) అచ్చటను, తరువాత కొలఁదిదినములకే రాజమంద్రి ఆర్ట్సుకాలేజీలోను, సంగీతసాహిత్యముల గూర్చి యుపన్యసించినపిదప వ్యాసరూపము నిచ్చుటకు సంకల్పము గలిగెను. అది సంకల్పమాత్రముగనే యుండి రాజమహేంద్రవరమున యువతీసంస్కృతకళాశాలలో వైస్‌ప్రిన్సిపాలుగ నుండినపు డచటిసంగీతము చూడఁగ చూడఁగ నీ వ్యాసమునకు త్వరగలిగినది. 1933 సం॥ ఆవిషయమే రెండుమూడుసారు లుపన్యసింపఁగ ఈప్రస్తుతస్వరూపము నొందినది. ఇందు సంగీతములో స్వరకల్పనలు, దశవిధగమకములు మున్నగు వానికిని, సాహిత్యములో ప్రబంధములనుండి మహాకవుల కవిత్వసౌందర్యమునకును—గ్రంథము పెఱుగునను భీతిచే, నుదాహరణము లెత్తి చూపలేదు.

ఈ చిన్నపొత్తము రాజమండ్రి కొవ్వూరు నరసాపురము వారిసాయమున వెలువడినది. వారికి నేను కృతజ్ఞుఁడను.

అచ్చటచ్చట కొందరి కితవుగాని కొన్నివిషయములుండ వచ్చును కాని యవివ్యక్తిపరములుగ నొకరికొఱకును మఱొకరి నుద్దేశించియు వ్రాసినవికావు.

35 వ పుటలో కావ్యేషు నాటకౌరమ్యాః అని యున్నది. "కావ్యేషు నాటకం రమ్యం" అని చదువుకొననగును. మఱి యితరదోషము లెట్టివేనున్నచో చదువరులు సహృదయులుగ తెలిపినచో అవసరముబట్టిసవరింతును.

రాజమంద్రి
25—3—35

ఇట్లు, విధేయుఁడు
కృ. వెం. సుబ్బారావు.

విషయానుక్రమణిక

విషయము

శ్రీరస్తు.

" దేశభాషలందుఁ దెలుగులెస్స "

సృష్టిలో జంతువులన్నిటిని (ప్రాణికోటి) మించి మనుష్యునకుఁగల యాధిక్యము మాటలాడుట యాలోచించుట. మాటలాడుటకు భాష యావశ్యకము. భాషవలననే భావముల నొకరికొకరు తెలియఁజేయ గలుగుచున్నారు. అట్టి భాషాభివృద్ధి దేశాభివృద్ధి కెంతయవసరమో వేఱుగ చెప్పనక్కరలేదు. ఇట్టిభాషాభి వృద్ధికితోడ్పడువారేకవులు. వాఙ్మయమనగా కేవలము నవలలునాటకములు ప్రబంధములనియు, కవులనగాకందము చెప్పు వారు ఛందోబద్ధములగు కూర్పులు నాల్గింటి వెలువరించువారనియు నొకయభిప్రాయ మేమూలనైననుండునేమో. చరిత్రలు, శాస్త్రములు, రాజకీయములు, నైతికములు, లోనగునవి (రైల్వేనవలలు, పొడుముపొకచెక్క సంవాదము, గుంటూరుగుంట, రాజమండ్రిరవ్వ, మున్నగు నుద్గ్రంథములు, ప్రస్తుతము దేశమును గగ్గోలుపఱచు భావప్రకటనలు, ఉక్కిరిబిక్కిరి కవిత్వములు విడిచి) చదువుటకు యోగ్యతగల యేగ్రంథమైనను వాఙ్మయాభివృద్ధికి తోడ్పడునదే. వార్తాపత్రికలలో కాని, వ్యర్థప్రకాశకులచేగాని ప్రచురణభాగ్య మబ్బిన ప్రతిరచనయును భాషాలంకారమను వెఱ్ఱిగలవారు లేకపోలేదు. ఒకటి రెండుపంక్తులు గికురించినమాత్ర నొక కవియు, పరీక్షలు

తప్పిన యాగ్రహముననో, న్యాయవాద్యాదినిజవృత్తుల పని లేమి తీఱికచేతనో పాఠకదౌర్భాగ్యదశనో అపరాధపరిశోధక నవలను రచించిన పూజ్యుఁడనొక గ్రంథకర్త యయిన నట్టి వారికి మా నమశ్శతములు.

పాశ్చాత్య దేశములందువలె మనదేశమున ప్రత్యేక చరిత్రలు లేకుండుట నాగరికులకొక గొప్పలోటుగ తోఁచక మానదు కాని యట్టివి వీరనుకొనినంత నిరాధారమని నేనువిశ్వ సింపను. వాయుపురాణాదులను రామాయణాదులను భూగో ళములేని కొఱంత కొంతవఱకైనఁ దీఱకమానదు. కేవలరస హీనమగు (Dry-as-dust) చరిత్ర ఫక్కి వారికి రుచింపక కా బోలు, ప్రబంధాదులలో వంశానుక్రమణికాదివర్ణనముల మూలమున చరిత్రాంశములు వ్రాయఁజొచ్చిరి. రానురానవి కేవల స్తోత్రపాఠానుకరణములైనవి. మేఘసందేశాదులలోఁ గల కథయేమి? మేఘసంచారమను నెపమున ఉజ్జయిన్యాది నగరములు, గంభీరాదినదులున్నగు భౌతికపటము చిత్రింపఁ బడినది. ఇటీవల పరిశోధకులు, వాయు, బ్రహ్మాండ, పురా ణాదులవలనను; భాస్కరగణితసిద్ధాంతములవలనను మనదేశ భూగోళచర్చలును, కతిప్యాంశలు నెఱుంగఁజాలియున్నారు. (South Indian Research లో కొన్ని చూడనగును.) ఎటు లున్నను దిఙ్మాత్రము లైనవేకాని వలయు పరిమితిని లేవు. శతకములు మున్నగునవి తొలుతను దేశకాల పాత్రాచా

-రాదులగు విషయములు దెలియుటకుఁగూడ నాధారములగుచువచ్చినవి. క్రమమున నవియును కేవల పద్యప్రాయములును, భక్త్యాద్యుపకరణములే యైనవి.

భాషాభివృద్ధికి దేశాభ్యుదయము పెక్కు విధముల తోడ్పడును. ఒకదానినిగల వ్యత్యస్త పరిణామములు రెండవదానియందును గన్పట్టును. రాజపోషణమున నొక్కొకటి రాజభాషయై దేశభాషయై సముచితాదరమున పెంపొందుచుండును. కవులకప్పుడు నోములపంట, గ్రంథకర్తలకు పాడిపంట, ప్రకాశకులకు భాగ్యోదయము. అటుకాక దేశము క్షుభితమై, దారిద్ర్య భూయిష్ఠమై, అశాంతిఁబఱఁగిన రచయితలవా తెఱలకు బీగములువడినట్లు, కవుల కలములకు సంకెలలు దగిలినట్లు, భాషాయోష బ్రతుకుదెఱువులేక వలస పోయినట్లుకదా.

ఆంధ్రదేశ చరిత్రము, ఆంధ్రరాజుల చరిత్రము దెలిసినచో ఆంధ్రభాషా చరిత్రముగూడ తెలియఁగలదు. ఆంధ్రజనులపేరు మొదట నైతరయబ్రాహ్మణమున (క్రీ. పూ౧౦౦౦) నాటి గ్రంథమునఁగన్పడును. (వాల్మీకి రామాయణ, వ్యాస భారతముల వలనను, వాయుమత్స్యపురాణములవలనను) (కాణ్వవంశపు కడపటిరాజును ఆంధ్రరాజు చంపినట్లు) గూడ తెలియును. క్రీ.పూ. 300 సంవత్సరప్రాంతమున ఆంధ్ర రాజ్యమత్యున్నతదశ నున్నట్లుగ మెగస్థనీస్ (Chandragupta's

Embassador)వ్రాసెను. మగధరాజ్యము తరువాతహిందూ దేశములో నున్నతస్థితి నొందినది ఆంధ్రరాజ్యమే. అశోకు ననంతరము సామంతులగు నాంధ్రులు మగధేశుల లక్ష్యపెట్టక స్వతంత్రులయిరి. పురాణములు, శాసనములుబట్టి ఆంధ్రవంశము (శాతకర్ణవంశము) కృష్ణా, గోదావరీనదుల మధ్యరాజ్యమేర్పరచుకొని మగధ దేశమువరకు నాక్రమించిరి. వీరు తూర్పున శ్రీకాకుళము (కృష్ణాజిల్లా చల్లపల్లి జమీాలోనిదని యొకయభిప్రాయము) రాజధానిగ గలిగి క్రమమునఁ బశ్చిమమునకుఁ బోసాగి క్రీ॥ శ॥ 1515 కళింగదేశముపై దండెత్తి విజయవాటినుండి శ్రీకాకుళమేగినపుడు విష్ణుచిత్తీయ రచన సందర్భమున "దేశభాషలందుఁ దెలుగులెస్స" యని యాంధ్రవిష్ణువుచెప్పెను. పిమ్మట, అమరావతి, ధరణికోటయు వీరికి రాజధానులైనవి. రాజ్యాభివృద్ధిని, ప్రతిష్ఠానపురము (ప్రస్తుతము పైఠన్) పశ్చిమ రాజ్యధానిగ నుండెను. శాతకర్ణి యనునతఁడు కాణ్వుఁడగు మగధరాజును (క్రీ. పూ. 27) జంపి దానినాక్రమించెను. అప్పటినుండియు నాంధ్రరాజులు తలయెత్తినపుడెల్ల నాంధ్రసరస్వతి సుఖవిహారము సలిపినది. (క్రీ. శ. 68) హాలుఁడనువాఁడు మంచి విద్వాంసుఁడును గవియునై, కవుల నాదరించెను. (సప్తశతియనిప్రాకృతమున రచించెను.) క్రీ.శ. 114-138 వరకు రెండవ విలివాయకరు అను నతఁడున్నతుఁడై పరరాజులగు క్షేత్రపుల (Satrops) ద్రోలి చస్తను నతని తనప్రతినిధిగ నుజ్జయినిలోనుంచి రాజ్యము విస్తరింపఁజేసెను.

పిదప పులుమాయి, రుద్రమానులు రాజ్యమేలిరి. ఈ రెండవ పులుమాయి ఆంధ్రరాజ్యములోని సౌరాష్ట్రము (కధియవాడ్) మాళవము, కచ్ఛము, సింధుదేశము, కొంకణము నాక్రమించెను. తరువాత క్రీ. శ. 184-213 యజ్ఞశ్రీరాజ్యము వైభవముకలదై వెండినాణెములు చేయించెను. సముద్రవర్తకము పెంపొంది యుండెను. అంతరాజ్యము భిన్నశకలప్రాయమైనది. దక్షిణమున కాదంబులు, పల్లవులు, వేఁగిరాజులు ఆంధ్రరాజ్యమాక్రమించిరి. కృష్ణా గుంటూరు మండలములలో అమరావతి జగ్గయ్యపేట మున్నగు నెడల నుండి పిదప బౌద్ధమతము విడిచి బ్రాహ్మణులయిరని తెలియవచ్చును. అప్పటి నాగరికత యీనాటికెందును దీసిపోక కొన్నిట విశేషించియుండెను. ఇటలీ, గ్రీసు, టిబెట్టు, చీనా పారసీకులతో వ్యాపారములు, రాకపోకలు, సముద్రయానములు, సక్రమపరిపాలన గలిగియుండెను. పాటలీపుత్రము మున్నగు-చోట్ల ధర్మౌషధశాలలుండెను. దీనికి తరువాత 600 యేండ్లకుపైనయూరపుననిట్టిది యొకటి బయలుదేరెను, హిందూదేశమే ప్రపంచమునకు మార్గదర్శి. ఋగ్వేదకాలమునఁ బ్రారంభమైన జ్యోతిష మీకాలమున వృద్ధినొందెను. (గార్గ్య, పారాశర్యాదులు) మను యాజ్ఞవల్క్యాది స్మృతులును వెలువడినవి.

క్రీ.శ. 500-1200 వరకు నిది పౌరాణిక యుగమని చెప్పవచ్చును. విదేశయుల దాడి హెచ్చెను. విక్రమార్కుఁ

దుజ్జయిని నేలుచు నిట్టి పరరాజుల (తురేనియనులు etc.) జయించి శకకర్తయయ్యెను. కాళిదాసాదు లీతని యాస్థానముననుండి సరస్వతిని నిండుమనమునఁ బెంచిరి. పిమ్మట శ్రీహర్షుఁడును తానుకవియై గ్రంథములురచించికవులఁ బోషించెను. శాస్త్రపరిజ్ఞానము మహోన్నతత్వము నందెను. హియాన్ సన్ అను బాటసారి వలన నానాటి మన ఆంధ్రచరిత్రయుఁ గొంత తెలియవచ్చినది. గంజాం మండలమువాడగు కుమారిలభట్టు జైనబౌద్ధమతములను ఖండించి (కర్మవాదియగుటచే) జైమిని కృతపూర్వ మీమాంసకు భాష్యము వ్రాసెను. అటుపై శంకరుఁడు (మళయాళ దేశస్థుఁడందురు) జన్మించి హిందూ మతోద్ధారకుఁడై గీతకు, ఉపనిషత్తులకు, సూత్రములకు భాష్యములు వ్రాసెను. (అద్వైతమతస్థాపకుఁడు క్రీ. శ. 7:వ శతాబ్దమువాడు.)

11 వ శతాబ్దమున రామానుజుఁడు జనించి శంకరుని మతమును తిరస్కరించి ప్రస్థానత్రయము వ్రాసి వైష్ణవ మతమును బోధించెను. (ఇతఁడు విశిష్టాద్వైత మతస్థాపకుఁడు) శంకరుఁడు జ్ఞానమార్గోపదేష్ట. రామానుజుఁడు భక్తిప్రాధాన్యవాది అనంతరము అనంతతీర్థులను నతఁడు ద్వైతమత కారకుఁడు వెలువడెను. వీరి యనుయాయులే నేటిమాధ్వులు. కర్ణాటకమున దీని కెక్కుడు వ్యాపకముకలదు. ఈతఁడును ప్రస్థానత్రయ భాష్యమువ్రాసి మఱియుచాలగ్రంథములు రచించెను.

ఇట్టివాఁడు బసవేశ్వరుఁడు మఱొకఁడు. ఇతఁడుభక్తియే ప్రధానమని బోధించి సంస్కర్తయై 'లింగధారణ' మతమును బయలుదీసెను. ఈతఁడు బిజ్జలుని మంత్రి, బసవపురాణ మిప్పటిదే. క్రీ. శ. 1162 కల్యాణపురము.) విక్రమాంక దేవుని నాయకునిగావర్ణించు విక్రమాంకదేవ చరిత్రము బిల్హణకవిచే 1100 సం॥ ప్రాంతమున రచింపబడెను. కల్యాణపురమున నిచ్చటనే మితాక్షర ధర్మశాస్త్రమునకు కర్తయైన విజ్ఞానేశ్వరుఁడునివసించియుండెను. తరువాత తైలుఁడు తరువాత బిజ్జలుఁడు శైవమతవృద్ధియు చెప్పబడినవి.

సామాన్యచరిత్ర మటుంచి తిరిగి యాంధ్ర చరిత్రమున ప్రవేశింతము. పల్లవులు, పూర్వపశ్చిమ చాళుక్యులు ప్రబలిన తరువాత దేవగిరి యాదవులును, ఓరుగంటి గజపతి రాజులు మహారాష్ట్రాంధ్ర దేశముల వైభవమున నేలిరి. మిక్కిలి దక్షిణమున పాండ్య, చేర, చోళ, రాజ్యములు తల లెత్తినవి. కల్యాణపట్టణము రాజధానిగ పరిపాలించుచు పుల కేశియను నతడు క్రీ. శ. 610 వేఁగిదేశమునుండి పల్లవుల పారఁద్రోలి దాని నాక్రమించెను. ఇతని విఖ్యాతి పారసీక రాజులనుండి జఱిగిన రాయబారములవలనఁ దెలియఁగలదు. కాంచీ దేశము వేఁగిదేశము అయిదారవ శతాబ్దములవరకు పల్లవుల చేతులనుండెను. ఆంధ్ర, ద్రావిడ, కర్ణాట దేశములు వీరుజయించిరి. 7 వ శతాబ్దమున పశ్చిమ చాళుక్యులు వీరినోడించి ఆంధ్రదేశమును వశపఱచుకొనిరి.

కృష్ణా గోదావరులకునడుమనున్న యెనిమిదివేలచదర పుమైళ్ళ వైశాల్యముగల తెలుగుసీమ వేఁగినాడందురు. 7 వ శతాబ్దమునుండి 13 వ శతాబ్దమువరకు తూర్పు చాళుక్యులు దీనిని పరిపాలించిరి. ఏలూరు సమీపముననున్న వేఁగి దీనికి రాజధాని. ఉత్తరమున కళింగవరకును, దక్షిణమున పల్లవుల (చోళ) కాంచీనగరమువరకును విస్తరించియుండెను. రెండవ పులకేశి చోళులజయించి తనతమ్ముని కుబ్జవిష్ణు వర్ధనుని వేఁగికినియమించెను. ఇతఁడు క్రమమున స్వతంత్రుఁడయ్యెను. కుబ్జవిష్ణువర్ధనుఁడు 615నుండి 633 వరకు పరిపాలించెను. పిష్ఠపురదుర్గము (పిఠాపురమును) సాధించెను. దిమిలి సీమలోని వీని శాసనములచే విశాఖపట్టణ మండలమువరకును రాజ్యము విస్తరించినట్టుతోఁచును. ఇతనిపుత్రుడు నెల్లూరువరకు రాజ్యము విస్తరింపఁజేసెను. వీనిదాన శాసన మొండు(గుడివాడ తా॥ పెణుకపఱ్ఱుగ్రామ మొకవిప్రునికిచ్చినట్టు)గలదు. ఈవంశమున నిరువదియాఱవ రాజగు విమలాదిత్యుఁడు 1015-1022వఱకు రాజ్యము చేసి రాజేంద్ర చోళుని చెల్లెలు రాజకేసరివర్మ కూతురునగు కుండమాంబాదేవిని వివాహమాడి యామెవలన ఆంధ్రభారతకృతిపతియగు రాజరాజనరేంద్రుని గాంచెను. అచ్చటచ్చట చెప్పఁబడిన పురాణాదులు సంస్కృత రచనలుదక్క ప్రత్యేకముగ నాంధ్రగ్రంథ సంపత్తి విమలాదిత్యుని నాటి వఱకు నెంతగలదో తెలియు నాధారములులేవు. ప్రస్తుతము వ్యాపకముననున్న ఆంధ్రభాష కానాడు నామకరణమైన

జనియే ప్రస్తుత భావన. వీని తరువాత కులోత్తుంగ చోళదేవుడు విక్రమచోళుఁడు నిట్టి యౌన్నత్యమునకు పాత్రులైనట్లు గన్పట్టదు.

1278 నాటికి కృష్ణా గోదావరీ మధ్యదేశము గజపతి రాజుల వశమైనది. ఇప్పటికి చాళుక్యులు (సూర్యవంశ్యులు) చోళులుఁ (చంద్రవంశజులు సంబంధ బాంధవ్యములచాలదగ్గర వారైరి. చోళులనాటి నాగరకత యమూల్యమైనది. ప్రజా పాలనము,(Democracy) చక్కగ సాగుచుండెను. పంచాయతీలు, పన్నువసూళ్లు, దేశోపయోగవ్యయము, తోటలు కాలువలు, సేనలు, తాలూకా, జిల్లావిభజనలు మొదలగువానిచే శాంతియుతమై సర్వ సమ్మతముగ నుండెను. ఇంతలో దేవగిరి యాదవవంశ మొకటి తలయెత్తి ఐదవ భిల్లముఁడు చళుక్యుల పరాభవించి కళ్యాణ పట్టణములోఁ జొచ్చుకొనియెను. కృష్ణ క్షేత్రమాక్రమించి దక్షిణము గెలువఁబోయి యోడెను. ఉత్తరహిందూస్థానమున గోరీ పృథ్వీరాజుతోఁబోరు సమయమిదియే. జైత్రపాలుని (వీనికొడుకు) యాస్థానమున భాస్కరాచార్యుని పుత్రుఁడుండెను. ఈ యాదవుల రాజ్యమున సంగీత రత్నాకరమను గ్రంథము శార్ఙ్గదేవునిచే రచింపఁబడెను. వీరి పాలనముననే భాస్కరునితమ్ముఁడగు శ్రీపతి, తత్పుత్రుఁడు గణపతి, వానికుమారుఁడు అనంతదేవుఁడు మున్నగువారి వలన గణిత (జ్యోతిశ్శాస్త్రము) చక్కని యభివృద్ధి గాంచినది. చాంగదేవుఁడు (భాస్కరుని మనుమఁడు) సిద్ధాంత శిరో

మణియను గ్రంథము నేర్పుటకై పాఠశాలను స్థాపించెను. పిమ్మట కృష్ణుని యాస్థానమున సూక్తి ముక్తావళి, వేదాంత సూత్ర భాష్యమునకు టీక (గ్రంథములు) వెలువడెను. అటుపై రామదేవుఁడేలెను ఈతఁడు ఓరుగంటి ప్రతాప రుద్రునివలెనే ఢిల్లీకి చెరఁగొంపోఁబడెను. ఈయిద్దరితోడనే వారివారి వంశము లంతరించినవి. రామదేవుని దానశాసనములనుఁబట్టి యానాటి సాంఘిక నైతిక విషయములు తేటపడఁగలవు. ఈరాజునొద్ద హేమాద్రి బోపదేవులు విద్వాంసులు గలరు. హేమాద్రి ధర్మశాస్త్రములగురించి (చతుర్వర్గ చింతామణి etc.) వ్రాసెను. ఇతఁడు మోడీయను లిపినిర్మించెను. ఇండ్లుకట్టు నూత్నవిధము కనిపెట్టెను. రెండవవాడు ముగ్ధబోధమను సంస్కృత వ్యాకరణము, కొన్ని వైద్యగ్రంథములు రచించెను. మాలికాఫూర్ (అల్లాఉద్దీన్ ఖిల్జీ సర్దారుఁడు) వీనిని చెఱఁ గొనియేగెను.

తూర్పు చాళుక్యులకు పిదప నాయకులైనవారు గణపతిరాజులు, వీరే కాకతీయ వంశజులు, వీరిరాజధానిని ఓరుగల్లు (Present Warangal in Nizam)ఇచటనే అనుము కొండ యను గ్రామముకలదు. కాకతీయులు గంగ వంశజులని కొందరు, చోళులని కొందరు, యాదవసంతతియని కొందరు. వీరు మొదట చిన్నసంస్థానాధిపతులుగనుండి తరువాత మహాబలవంతులై ఓరుగంటిరాజ్యమని పేరుమ్రోగునట్లుచేసిరి అనుముకొండలో వీరు నిర్మించిన వేయిస్థంభములగుడి శిథిలమయ్యును వైభవము

చాటును, ఓరుగంటి దుర్గముపాడువడి నామావశిష్టమైనను తొల్లింటి విఖ్యాతిని సూచించును. కాకతిప్రోలరాజు 1109 వఱకు రాజ్యముచేసి ఉత్తరమున కటకముఁ దక్షిణమున శ్రీశైలము, తూర్పున సముద్రము, పశ్చిమమున మాల్యవంతము వఱకు నేలెను. వినికుమారుడు మొదటి ప్రతాపరుద్రుఁడు. వీనికుమారుఁడు గణపతిరాజు. ఇతఁడు దేవగిరి యాదవులపై దండెత్తి యప్పనములుగొని రాజపుత్రికయగు రుద్రమదేవిని గొని సంధిగొప్పుకొనెను. చోళ కటక రాజులను మన్నెదొరలను గెలిచెను. పరనారీసహోదరబిరుదులుండుటచే వీనిపవిత్రశీలము తెల్లమగును. ఈతఁడు శైవమతాభిమానియై జైనమతము రూపుమాపెననివాడు కకలదు. తిక్కనసోమయాజి ప్రేరేపించి జైనులఁ జంపించి, పారదోలించెననియు చెప్పుదురు.

కాకతీయుల సామ్రాజ్యము తిరుచినాపల్లివరకు వ్యాపించెను. కంచివీరిస్వాధీనమున నుండెను. దక్షిణమున కడపటి పాండ్యరాజు (నామకుఁడైనవాఁడు) సుందరుఁడు, దక్కను, దక్షిణయిండియా మాలికాపూర్ అనునతఁడు కొల్లగొని ద్వారసముద్రమును భీభత్సమొనరించి పోయిన దేశ మల్లకల్లోలమయ్యెను. ఈతరుణమున రవివర్మ కులశేఖరుఁడను నతఁడు కంచివరకు జయించుచుఁ బోయెను. ఇట్టియదనునతుంగాభద్రాతీరమున నిరువురు వచ్చి యొక క్రొత్తనగరము 1336 (విజయనగరము స్థాపించి) దేవగిరి యాదవుల

వారమని చెప్పి దక్షిణదేశమునకు ప్రభువులైరి. రాజరాజు (కులోత్తుంగ చోళదేవుని) నాటి ఐకమత్యమిపుడు మరలకుదిరెను. వీరిరువురు హరిహరరాయలుబుక్కరాయలు. వీరు రాయల వంశములోనివారు (ఆనెగొందినుండి విజయనగరము నకు రాజధానిని మార్చిరి.)

కాకతీయ సామ్రాజ్యము క్రమశః అస్తమించినది. విజయనగర సామ్రాజ్యము దినదిన ప్రవర్ధమానమగుచున్నది. రెడ్డిరాజుల ప్రభుత్వము నొకవంక నున్నతివడసెను. తరువాత బహామినీరాజ్యము (గోల్కొండ నవాబుల రాజ్యములు) బయలుదేరినవి. కృష్ణదేవరాయల రాజ్యము రాయచూరు ముట్టడి ఈసంబధమగు చరిత్ర ప్రస్తుతమందరకును దెలిసినదే. అవసరమాత్రముగ నచ్చటచ్చట కవుల చరిత్రములలో వారి వారిగూర్చి తెలియపరతుము.

రాజరాజనరేంద్రుఁడు తెలుఁగు సారస్వతమునకు ఆంధ్రభోజుఁడు. తెలుఁగు భాషవీని చేతులలోఁ బెరిగి మాటలాడ నేర్చిగారాము నొందినది. ఈతని ఆస్థానమున నారాయణ భట్టునన్నయభట్టుమున్నగు పండితులుపావులూరి మల్లన యను గణితశాస్త్రజ్ఞుఁడు గలరు. నన్నయ నారాయణభట్టు సాయము గొని రాజనరేంద్రుని కృతిపతి గావించి సంస్కృత భారత మునుదెనిగింపఁ దొడఁగెను. ఈతని ఆంధ్రశబ్ద చింతామణి రచనము భారతమునకు పూర్వము ఈకాలమున నధర్వణాచార్యుఁ డనునొకకవి భారతముదెనిగింపఁబూనెనట. అది శిధిలమైనది.

కొన్నిఘట్టములు ఆంధ్రసాహిత్యపరిషత్తు వారికి లభింపఁగాఁ బ్రకటించిరి. ఈతని వ్యాకరణమునొకటికలదు. ఈతని కించుమించు సమకాలీనుఁడు వేములవాడ భీమకవి ఈతఁడు కళింగ గంగరాజులకడను (భొక్కనృపాలుని కడను) నుండెనట. ఈతని కవిత్వ మనర్గళమైనది. ఇతని ఛందము ప్రసిద్ధమైనది. ఈతనిచాటువులు చాల ప్రచారమున నున్నవి. ఈతఁడు రాఘవపాండవీయమను ద్వ్యర్థికావ్యమును రచించెననికొందరు. వీనిపద్యముల వలన ఆనాటి శబ్దరూపములు గొన్ని తెలియవచ్చును,నాండుమూండు, ఆంద్రు (ఇట్టివి నేటిఅరసున్నలకు నాఁడు, మూఁడు,) మున్నగునవియున్నవి. చాళుక్య చోళ వంశముల సంబంధ బాంధవ్యములవలన చోళులుగూడ పరిపాలించిరని మున్నె చెప్పియున్నాము. నన్నెచోడుడను నొక ప్రభువు తానుకవియై పండితుల కవుల నాదరించెను. ఆంధ్ర కుమార సంభవము వీనిరచనము. ఇందలి శయ్య చాలమధురము. అందుగూడ పైఁగల నాటిరూపములుగాననగును. అందు దెలుఁగుపదముల పొందిక ప్రశంసనీయము. కొందరు రామాయణకర్తయగు భాస్కరుడుకూడ నన్నయకు పూర్వుఁడే యందురు. అందులకు కారణము తిక్కన భాస్కరుని తనతాతయని వ్రాసెను. నన్నెచోడుఁడు భీమకవియు పూర్వులై నగావచ్చును. నన్నయ రెండుపర్వములు పూర్తిచేసి మూఁడవదానిలో కొంతవరకే ఆంధ్రీకరించెను. పిమ్మట తిక్కన రాజుచే నియమితుఁడై (నెల్లూరు మండలాధిపతి

యగు మనుమసిద్ధి కాలమువాఁడు) మిగిలినపదునేను పర్వములు తెనిఁగించెను. భాస్కరుఁడు, మల్లికార్జునభట్టు (అయ్యలార్యుఁడు, కుమారరుద్రదేవుఁడు) మున్నగు వారిచే వాల్మీకికృతమగు రామాయణము దెనిఁగింపఁబడెను. గ్రంథముల నంకితములబట్టి యానాటికవులకుఁగలమన్ననయు, వారిప్రభువుల యాదరమును (Impetus) తెలియును. రాజునకు బంధువగు రంగనాథుఁడు రామాయణమును ద్విపదగా రచించెను. పై రామాయణ కవిత్వము ప్రౌఢముగ హృద్యముగ నుండును. రంగనాథరామాయణము ద్విపదవృత్తమున నుండియు, పై గ్రంథ శయ్యలకు వెనుకపడక ప్రౌఢోక్తుల నెనయుచున్నది. ఈ రామాయణకవులే, ఎఱ్ఱాప్రెగడ పోతనాదులకు అంత్యానుప్రాసమున కాదర్శులైరి. ఇందు కొన్ని నన్నయభట్టీయవ్యాకరణవిరుద్ధప్రయోగములుండుట చేతను నన్నయకు పూర్వులాయని తోఁచును.

తిక్కన సోమయాజియై షట్ఛాస్త్రపండితుఁడై కవిబ్రహ్మయై భారతము పూర్తిచేసి నిర్వచనోత్తర రామాయణమునుగూడ రచించెను. కాకతిగణపతిరాజునకు సమకాలీనుఁడు. గణపతి రుద్రాదులును కృతిపతులైయాంధ్రకవులఁ బోషించిరి. తిక్కన కవివాగ్బంధమను లక్షణగ్రంథముకూడ వ్రాసెను. తెలుఁగుబాలిక యిప్పటికి విద్యాబుద్ధుల నేర్చినదగుచున్నది. తిక్కన దానికి యొజ్జయయ్యెను. తిక్కన కుమారుడు మారనకవి మార్కండేయ పురాణమును రచించెను.

సోమదేవరాజీయమను ప్రతాపరుద్రుని వంశచరిత్ర మప్పటి చరిత్రకు కొంతతోడగుచున్నది. తిక్కన సమకాలికుఁడగు కేతన యొకఁడు పేర్కొనఁదగినవాఁడు. ఆంధ్రభాషా భూషణమను లక్షణగ్రంథమును రచించి, హారవిలాసమను మరియొకగ్రంథము కూడరచించెను. ఇతఁడు దండికవికృతమగు సంస్కృత దశకుమారచరిత్రము దెనిఁగించెను. ఇది తిక్కన కవినే కృతిపతిగ గల్గినది. దీనిచే తిక్కనకు కేతనకవనమందు గల గౌరవము తెలియవచ్చును. భారతము రాజకీయాంశముల నివేదికయగునట్లు కేతనదశకుమారచరిత్ర సాంఘికాచార సంవేదియై యానాటి చరిత్రము తెలుపునదగుచున్నది.

ఇట్లుగ తెలుఁగుబాలిక కాకతీయులకడఁ బెఱుగుచు, రెడ్డిరాజుల పోషణమునకువచ్చెను. ఈకాకతీయుల యభిమానమున శైవమతము పెచ్చుపెఱిఁగి జైనాదుల నడంచెను. పాల్కురికిసోమనబసవపురాణము (ద్విపద) కావ్యము వెలువడెను. మఱియు పెక్కుశైవగ్రంథము లానాఁడుదయమైనవి. రెడ్డిరాజులు కొండవీడు నేలుచుండగ, బుక్కరాయల వంశ్యులు ఆనెగొంది నేలుచుండిరి. తెనుఁగుభాష వీరిండ్ల నాట పాటలు నేర్చి ఇండ్లుచక్కఁ బెట్టగలనేర్పు వహించు ప్రాయమునకు వచ్చినది. ఈరెడ్డిరాజులయొద్ద శంభుదాసుఁడను ఎఱ్ఱాప్రెగడ యనుకవి యొకఁడు పొడసూపెను. ఈతఁడు భారత మసమాప్తముగ నుండుటచూచి తచ్ఛేషమును (అరణ్యమున నన్నయచే విడువఁబడినదానిని) పూరించెను. నృసింహాపురా

ణము, హరివంశమునను మఱిరెండు గ్రంథములువ్రాసి ప్రబంధకవిమార్గదర్శియగుట ప్రబంధపరమేశ్వరుఁడని బిరుదు వడసెను. రమారమి వీని కాలముననే విజయనగర రాజులకడ “నిరంకుశాః మహాకవయః” యని సార్థకపఱచుకొనఁదగిన యొక ప్రౌఢకవి నాచన సోముఁడు ప్రజ్వరిల్లెను‘ సోము ప్రసాదము’ అని కావ్యాలంకార సంగ్రహమునను. “మహా మహులై సోముఁడు భాస్కరుండు”నని మఱియొకయెడను ప్రఖ్యాతివడయ, ఉత్తరహరివంశమను గ్రంథమును రచించెను. తిక్కనాదులకున్న గౌరవముకూడ నీతనికి కలదని చెప్ప వచ్చును.

ఇఁక తెలుఁగు సరస్వతి రెడ్డిరాజుల రాజసౌధ ప్రాంగణోద్యానములనే విహరించినది. ఇంతకుపూర్వమును నిప్పుడు గూడ చాలవఱకు సంస్కృతగ్రంథముల (Hidden treasures) దెనిఁగించుట ఆచారమైనది. అదియొకలోపమని చెప్పుటపొరఁబాటు. అందలి గనులఁ ద్రవ్వుట లోపమని ఎవరనఁగలరు? పద్మపురాణము శ్రీనాథకవి తాతయగు కమలనాభుఁడు, రామగిరి సింగనయు ననుకవులు తెనిఁగించిరి. విష్ణుపురాణము వెన్నెలకంటి సూరన యాంధ్రీకరించెను. స్కాందపురాణమున చాలవరకు శ్రీనాథుఁడే తెనిఁగించెను (కాశీఖండము, భీమఖండము). పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడు జైమినిభారతమును శకుంతలాపరిణయమును రచించెను. కంకంటి పాపరాజు, అయ్యలరాజు రామభద్రుఁడు ఉత్తరరామాయణము, రామా

భ్యుదయమురచించిరి. ఇట్లుభారతరామాయణాంధ్రీకరణములు పెక్కులుబయలుదేరెను. పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడు 'వాణి నారాణి' యని చెప్పసాహసించిన విద్వత్కవి. ఇతని శయ్య నిరంకుశధోరణీవేగముకలది. కంకంటి పాపరాజు ప్రౌఢకవి. శైలి యచ్చటచ్చట కఠినతరము. రంభారావణ సంవాదము మున్నగుచోటులనేకాక మొత్తమునను రసవంతము. ఇంత దనుకను నియోగివైదిక వ్యత్యాసములు కనుపట్టవు. వీని గ్రంథమున నార్వేల నియోగులగూర్చి ప్రత్యేకించి వర్ణించెను. మొత్తమున చాలవఱకు తెలుఁగు వాణి నాడునేడు నియోగికవుల నభిమానించినది. రామాభ్యుదయము మిక్కిలి హృదయరంజకమైన గ్రంథము. వీరికాలము వారిలో శ్రీనాథుఁడును, వానిబావమఱఁది బమ్మెర పోతరాజును ప్రసిద్ధులు. మహాత్తరులు. నరకృతి పతిత్వమొల్లక అగ్రహారాద్యనేక సంపదలను నిరసించి, కేవలభగవదంకితముఁగ భాగవతమునుఁ దెనిఁగించెను. లౌకికవరేణ్యుఁడై శ్రీనాథుఁడు రెడ్డిరాజులను ముంజేతులను నిలిపి రాజాధిరాజై సకలైశ్వర్యములంది యేగు చుండ నతని బావమఱిదిఁ హాలికుఁడై శరీరకష్టమున బ్రదికి భగవద్భక్తి పెంపొందుట ప్రపంచమునకెల్ల నీతిదాయక మగు నొకపాఠానుపాఠము (వ్యత్యస్తము) అగుచున్నది. శ్రీనాథుఁడురాఁగల 20వ శతాబ్దమునకుబాటసారి యయ్యెను. పోతననిజమగుహైందవాధ్యాత్మికతత్త్వవేది యగుచున్నాఁడు. రాజులవాకిళులవారివారిదయాధర్మములఁ బెరిగిన

యాంధ్రవాణి యట్టెరోసి పవిత్రబ్రాహ్మణునింటికి మరలెను. సింగనాదిప్రభువులు బ్రతిమాలి బెదరించి, యెట్లునుతద్వాణిని వారిండ్లకుకొని పోఁజాలకుండిరి. ఇతఁడు వీరభద్రవిజయము, భోగినీదండకమును గూడ రచించెను. భాగవతమునగల మఱికొందరు కవులపూరణములును తెలియఁదగినవి. శ్రీనాథుఁడు, వేమారెడ్డి, వీరభద్రారెడ్డి మున్నగువారల బంగరుపళ్ళెరముల నందుకొని ఆంధ్రవాణిని నెఱజవ్వనిగా నొనర్చెను. ఈతని శృంగారనైషధము "సంస్కృతవిద్వదౌషధమునకు" వన్నెమిఁచిన తెనుగుసేత కాశీఖండము కవిత్వము నకుగీటురాయి. ఈతనికవిత్వము బహుసుకుమారము. మంచి సౌష్ఠవముకలది. అభ్రంకషపవిత్రగంగాప్రవాహ వేగాతిశయముఁగలది. ఈతని చాటువు లానాటి దేశచరిత్రను వేయి విధముల తెలియఁజఱచుచున్నవి. ఇతనిపల్నాటివీరచరిత్రము దేశభక్తిని పురికొల్పుచుండును. రసోద్దీపకమైనది. కొంతవఱకు చరిత్రకాధారభూతము. ఈతడు, నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, సోముడుగాగలయందరిప్రతిభనుమూర్తీభవించిన సరస్వతియా యననొప్పును. ఈతని వీథినాటకమునఁగూడ నీతని శేముషి యపారముగఁగన్పట్టును. ఇంతటినుండి పురాణయుగము క్రమముగ గతించి ప్రబంధయుగమున ప్రభాతమైనది.

కృష్ణదేవ రాయలు ప్రభువయ్యెను. ఆంధ్రసారస్వతమునకు శిశిర మేగినది. చైత్రోత్సవదినము లేతెంచినవి. పెద్దన, రామరాజ భూషణుఁడు, ధూర్జటి, రామ

కృష్ణుఁడు మున్నగు కవికోకిలములు కృష్ణరాట్సభారసాలము నాశ్రయించినవి. క్రొత్త క్రొత్త పోకడలు, స్వతంత్రరచనలు ప్రబంధములు ఆరసాలము పుష్పించి ఫలించినది. కృష్ణరాయల యాస్థానమున అష్ట దిగ్గజములుండిరి. అల్లసాని పెద్దన, భట్టుమూర్తి ముక్కుతిమ్మన, పింగళి సూరన, (తెనాలి) రామకృష్ణకవి, రామభద్రుఁడు శంకరకవి, ధూర్జటి. వీరిలో పెద్దన "ఆంధ్రకవితా పితామహుఁ'డై కవిగండపెండేరమును స్వయముగ రాజుచేతఁ దొడిగించుకొనెను. వీని (స్వారోచిష) మనుచరిత్రము తేనెలొలికించు చుండును. భట్టుకవి వసుచరిత్రము విద్వత్ప్రబంధము. ఇది సర్వసామగ్రి కలయొకవిపణి. శ్రద్ధానందమునకిదిదక్క మఱేగ్రంథమునుదీనిముందు చెప్పఁగూడదు. దీని ప్రాచుర్యము తరువాత వెలువడి పిల్ల వసుచరిత్రలవలన (నేకవిజనరంజనము etc.)సు వేద్యము. వీని నరస భూపాలీయము అనుకావ్యాలంకార సంగ్రహము పేరువడ్డది. "ముక్కుతిమ్మనార్యముద్దుపలుకు" వానిపారిజాతాపహరణమునుఁ బట్టియేకదా ఒకపరి చదివినను అందలి. బాల్లవల్లపగ్రాస కషాయకంఠము' పేరలుకం జెందిన యట్టికాంతలు' 'ఎంతకులేదు నారదమునీంద్రుడు'—వీనివిడుచువారుండరని నమ్మెదను. పింగళసూరన కళాపూర్ణోదయము కవిప్రతిభను చూపుటయేకాక ఆంధ్రసారస్వతమున నిట్టిప్రతిభాశాలురగు కథానిర్మాతలున్నారను గర్వకారణమగుచున్నది ప్రభావతీప్రద్యుమ్నము నెఱుగని వారాంధ్రభాషా పరిచయము లేనివారని చెప్పుట యతిశ

యోక్తిగాకున్నను మాధుర్యము ఇట్టిదని తెలియనేరని వారనియైన చెప్పవచ్చును. రాఘవ పాండవీయము ద్వ్యర్థి కావ్యము. భీమకవి గ్రంథము వ్యాపకమువ లేనందున నిదియే ప్రథమమని చెప్పవచ్చును. భట్టుకవిశ్లేష పెక్కునెడల దీనిమించి రుచ్యమగును. అదికథావస్తువుననుగలదు రామకృష్ణకవి వికటకవియని లేనిపోని కథలు హేయము లైనవి వానికదికిన చరిత్రిలున్నవికానియవియవిశ్వసనీయములు. ఈతఁడుచక్కని విద్వత్కవి. ప్రౌఢకవిత్వము చెప్పువాడు. ఈతని చాటువులే వీని ప్రజ్ఞాతిశయములు నెఱుక పఱచును పాండురంగమాహాత్మ్యము శైలి శ్లాఘాపాత్రము. దీనికొకవ్యక్తిత్వము ప్రత్యేకత గలవు (Individuality & Speciality)

"అల్లసానివాని నల్లికజిగిబిగి, ముక్కుతిమ్మనార్య
ముద్దుపలుకు, పాండురంగవిభుని పదగుంభనమ్మును
......నీకుతగుర"

అని రామకృష్ణుఁడు కవి నుద్దేశించిచెప్పెను. వీని దశావతారపద్యములు అత్యంత కఠినములు. రామభద్రుని రామాభ్యుదయము మృదుశయ్యగలది. ధూర్జటికవి కాళహస్తిమాహాత్మ్యము శబ్దార్థములరెంటిని గణనకెక్కినది. ఇందుమతీపరిణయముగూడ వీనిదేయని కొందరు. ఈధూర్జటి కవిగూర్చి యొకకథయు గలదు.

"స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటిపల్కులకేలఁగల్గెనీ యతులితచాతురీమహిమ"—యని రాయలు అస్ఖలిత

బ్రహ్మచారిగ దాయనిధూర్జటివిషయమునసందియపడువాఁడట. శంకరకవి హరిశ్చంద్రోపాఖ్యానము పేరొక్కనఁదగిన గ్రంథము ఈహరిశ్చంద్రకథనే గౌరన ద్విపదకావ్యముగ రచించెను.

ఇవియటుండ ఒకటి మఱువరాదు. రాయలు వీరినం దరిమించిన ప్రౌఢకవి. వీని యాముక్తమాల్యద (విష్ణుచిత్తీయము) వీనినన్నిటి నతిక్రమించు కాఠిన్యముగలది. దాని యుత్కృష్టత ముండ్లచే నావరింపఁబడి పొదబడియున్న గులాబి వలె సులభసాధ్యము గాకున్నది. కంటకావృతమగుటచే మొగలినివలె కొందరు దీనిని వెదకి గ్రహింపఁజాలక విడుచు చున్నారు. ఇదికావ్యమనుటకంటె మతవేదాంత చర్చయనుట వీలుకాని శైలియు వర్ణనలు అపూర్వములు. పింగళిసూరన, శ్రీనాథుఁడు వీరికావ్యములు కేవల కవనములుగాక చరిత్రకు వలయు సామగ్రినీఁజాలినవి.

ప్రబంధకవులు పెక్కుమంది వీరిననుసరించిరి. జక్కన విక్రమార్కచరిత్రము, వేంకటాచలకవికృష్ణవిలాసము, రసిక జనమనోభిరామము, కవికర్ణరసాయనమును న్నగు నెన్నియో కయితలు బయలుదేరినవి. ఇందు తారాశంశాక విజయాదు లటుంచి, చేమకూరవేంకటకవి విజయవిలాసము లోనగునవి ప్రాముఖ్యముగలవి.

విజయనగరరాజ్యము క్షీణించినపిదప నాంధ్రసారస్వతము తగినపట్టుగొమ్మలేక యట్టిటు దశదిశలఁబోయెను. తిరుమలరాయలు పెనుగొండలోదాఁగి పిదప చంద్రగిరిపోయి

అటక్రమముగ మంత్రియై రాజయ్యెను. ఆంధ్రవాణియు అటు చంద్రగిరివైపు, దక్షిణమున తంజావూరుమధుర వైపు, నిటుబొబ్బిలి, విజయనగరము, పెద్దాపురమువైపు పలాయన మయ్యెను. మొదట రాయలు మరల తెలుగుకవులబోషించెను. చేమకూర వేంకటకవి విజయవిలాసము తెలుఁగు కయితలకు సానరాయి. బాససొంపునకు పాడిపంట. వ్యంగ్యధ్వనిభూషితము. శిరీషసౌకుమార్యముగలది. వ్యాకరణోల్లంఘనలు కాలవు ఇట్టిదికాకపోయినను, రసములొలికించునది ఆనంతామాత్యుని భోజరాజీయమొండుగలదు.

తరువాతవచ్చిన కవులలోగూడ నెన్నికగొన్నవారు లేకపోలేదు. వీరిలో పిండిప్రోలు లక్ష్మణకవి సంకుసాల నృసింహకవిగూడముఖ్యులు. ఈనృసింహకవి కవికర్ణరసాయన కర్త. లక్ష్మణకవి రావణదమ్మీయము వ్రాసెను. ఈసందర్భమముననే కూచిమంచిజగ్గకవిపాత్తము చెప్పవచ్చునుశిష్టుకృష్ణమూర్తివ్రాసిన ఎన్నికగుచాటువులునుగలవు హరిశ్చంద్రనలోపాఖ్యానము రావణదమ్మీయము మొదలగుద్వ్యర్థికావ్యములుగూడ అవతరించినవి. ఆంగ్లభాషలోవలెవ్యక్తిగతము(Personal) లగు వ్రాతలు రావణదమ్మీయ మునగలవు. ఋగ్వేదికవి వెంకటాచలపతికవి 'చంపూరామాయణము' పొగడఁదగిన గ్రంథము. సంస్కృతమునవలె ఆంధ్రమునను చంపూరచనమును జూపెను. అడిదము సూరకవి పూసపాటివారి సంస్థానమున నున్నవాఁడు. ఈతడు శాపానుగ్రహసమర్థుడు.

‘పెట్టినవిందు, పెట్టకున్న మందు’చాటుకవి హాస్యోక్తులుగలవు. కవిజనరంజనము రచించెను. వసుచరిత్రఇదియొక పిల్ల కూచి మంచి తిమ్మకవియు వానినీలా సుందరీపరిణయము మున్నగు నవియు పేర్కొనవలసినవి. పైడిపాటి లక్ష్మణకవి రచించిన ఆంధ్రభాషా నిఘంటువు మొదలగు గ్రంథములు కలవు. దూబగుంట నారాయణకవి రచించిన పంచతంత్రము ప్రసిద్ధ మైనదే. ఈసారస్వత చరిత్రమున తప్పక నెఱుఁగదగినవారు ముద్దుపళని తరిగొండ వేంకమాంబ, మొల్ల. వెంకమాంబ వేంకటాచలమాహాత్మ్యమును రచించెను. ఇది సులభశైలి కలది. మొల్లరామాయణ మందరునెఱిఁగినదే.

ఈకాలమున శతకరచన మధికమైనది. ఇందు వేమన శతకము చాలనాణ్యమైనది. ఇందమూల్యాంశములు గలవు. రాజకీయ, నైతిక, సాంఘిక విషయములు పండితపామరుల కందుఁబాటున నిమిడియున్నవి. కాసుల పురుషోత్తముని ఆంధ్రనాయక శతకము (శ్రీకాకుళాంధ్రదేవయని సంబుద్ధి) నొకటికలదు. శృంగారభరితుఁడగు ధూర్జటియే రచించెనందురు కాళహస్తీశ్వర శతకమొకటిగలదు. ఇది చాలవైరాగ్యోప దేశము కలది. మానసబోధమునిట్టిదే. ఇటీవల పెక్కులువెలు వడినవి. దాశరథిశతకముపఠన యోగ్యమైనది. ‘ఇందు’ శతకమువంటివి.రసవంతములగునవి నింకచాలగలవు. మతవి షయ ద్యోతకములగు వృషభాధిపశతకములు గలవు. భక్తచింతామణి శ్రీసూక్తిపసుప్రకాశకము నిట్టివేయని చెప్ప

వచ్చును. ఈశతకమునకు ఆదర్శముబహుశః భర్తృహరి సుషితము కావచ్చును నని మాయూహ (లక్ష్మణకవి ఆంధ్రీకరించినది.) కవిచౌడప్పధోరణి మఱొకమాదిరి. భాస్కర శతకము ప్రసిద్ధమైనది. కృష్ణ, నరసింహ, సుమతిశతకము నిత్యోపయుక్తములు. ఇటీవల శతకముల శతకకవుల చరిత్రలే వెలువడుచున్నవి. ఈశకములు బహుధా దేశమున కుపకరించుచున్నవి. వీనివలన పెక్కువిషయములు (నాగరకత, ఆచారములు, విమర్శనలు) విశదముగాఁగలవు.

చరిత్రలులేనిలోపము మనవాఙ్మయమున నింకొకరీతి నిగూడ దీఱుచుండెడిది. బొబ్బిలిరాజులు, విజయనగరము వారు (తూరుపురాజులు) వీరిచరిత్రములు వర్ణించు నుత్కృష్ట గ్రంథములరుదు. కాని పూర్వముననే వెలువడిన 'రంగనాధ రామాయణము ద్విపదకావ్యములలో మొదటిది. శ్రీనాధుని పల్నాటివీరచరిత్రము చరిత్రాంశములుగలదై చదువుకొలఁది నుత్సాహకరమై, వీరరౌద్రపోషితమైయున్నది. బొబ్బిలికథ, కామమ్మకథ ఇట్టివి ప్రజాసామాన్యమునకు బోధపడునటులు (మంజరీ) ద్విపదాదివృత్తములలో నుత్సాహోద్రేక పూరితవర్ణనములలో స్వదేశస్థుల శౌర్యసాహస విక్రమాదులు గంభీరముగను విపులముగనువర్ణింపఁబడి కీర్తింపఁబడుచుండెడివి ఇవి యక్షగానముల జాతిలోనివే. ఇట్టివి చాల గలవు. ముద్రణములు పూర్వము లేకుండుటచే సూత్రకాలమునుండి వచ్చుచున్నపద్ధతినే పాఠములవలన ముఖాముఖిగా తరతరములనుండి నశింపక నిలిచియున్నవి. తాటాకులలో వ్రాయు

టయు గురుముఖతః శిష్యులకు పాఠములై వల్లెవేయఁ బడు టయు వంశపారంపర్యముగ వచ్చినవి. వినుటకు వీనియందుఁ గూడ రసపుష్టియును నొకసొంపును లేకపోలేదు. భాషాపరిణామమున నివియు కొంతవరకు సహకారములేయని నాగట్టినమ్మకము. వీనియెడల అధునాతన నాగరికులవి తమ భావోత్కృష్ట్యమునకు భంగములని కావలయు (శీతకన్ను) నిరసన దృష్టిఁ బఱపుచున్నారు. ముద్రణాలు నిషేధములుగల యీ రోజులలో కవులరచనలు దేశచరిత్రలు, ప్రతాపశాలురగు మనదేశమువారి పౌరుషములు పరాక్రమములు నెట్లు వ్యాప్తి గలిగి ప్రచారమున నుండఁగలవు? మనపూర్వికుల నాగరకతలు, కళలు, శాస్త్రములు నశించినట్టి నిర్భాగ్యస్థితియే పట్టవలసివచ్చును. పరరాజులు వ్రాసి చెప్పిన నిజానిజములే మనకు విస్సన్న చెప్పిన వేదములు కావలసివచ్చును. పత్రికలలో నిజమైనవార్తలు రానివిషయము మనకుప్రత్యక్షము. కూపస్థమండూకవృత్తాంతమున కేమియు భిన్నము కాకయున్నది. అట్టినిషేధక శాసనములయందును 'దండాలు భరతమాత' యనునదియెట్లు వ్యాప్తినొందినదో గమనించఁదగిన యంశము.

కవిత్వచారిత్ర సంగ్రహమిటుండ నింతదనుక వచన రచనము తెలుఁగుభాషలో నెవరునుఁ దలపెట్టలేదు. పరవస్తు చిన్నయసూరి నీతిచంద్రికను చాలవరకు సంస్కృతపదమయముగనే తెలుఁగురచనసూపెను. కళువె వీరాజు, చద

లువాడ సీతారామశాస్త్రి, వీరభద్రాచార్యులు లోనగువారి రచనములు నేడు ప్రకటనగావించినవి. ఇవి యన్నియుఁ బ్రౌఢ శబ్ద గుంభితములుగఁదోఁచును. (భాషార్ణవము ఆంధ్రనామ సంగ్రహము లోనగునవి పద్యములు.) శబ్దరత్నాకరము సీతారామాచార్యులవారిచే సమకూర్పఁబడెను. ఇదిఅన్యప పద్ధతి. ఆంధ్రభాషాభూషణము, కవిజనాశ్రయము ఇవియు తెలుగుభాష నభ్యసించువారల కుపయుక్తములు. (అప్పకవీయము, సులక్షణసారము, ప్రౌఢవాక్యరణము,లను ప్రత్యేకముగ చెప్పలేదు.) ఇట్టియెడవచన (వ్యాస) రచన కందుకూరి వీరేశలింగముగారి చేతను చిలకమర్తివారి చేతను వెంకటశివుడుగారి చేతను గ్రంథరూపమగు నవలరూపముదాల్చినది. మఱి ప్రస్తుతము ఆంధ్రసారస్వత చక్రము గమనమున వేఱొక పరివర్తనము నొందినది.

హూణభాషా సంప్రదాయములు తలకెక్కినవి. 'క్రొత్త వింత పాతరోత'యని యాక్రొత్తరుచు లూటలూరించి యిందుఁజొచ్చినవి. ఇక రాజాదరణలేదు. తీఱికగలవారును అభిమానముగలవారునెవరోతక్క తెలుగుసరస్వతినాదరించినవారులేరు. బ్రదుకలేక బడిపంతులన్నట్లుపాఠశాలలపాలైనది. వీరినిఇంగ్లీషు భాషావాసన వశముచేసికొనినది, కందుకూరి వీరేశలింగముగారు స్వీయచరిత్రము, ప్రహసనములు, వ్యక్త్యుద్దిష్టములు (Personal) ఆక్షేపకములు (Satires) వెలువరించిరి. ఏలనో ఇంగ్లీషులోవలె స్వాత్వికత(Egoism) తెలుగుభాషలో నింకను

హెచ్చుగాగానరాదు. జాన్సన్ (johnson) వ్రాసి నట్లు (Poet is the poorest wretch అని) Goldsmith మొదలగు వారియంశ లీకవులకంతఁగఁబట్టలేదు. భుక్తికొరకు (For bread) వ్రాయుట చాలఅరుదు. వీరేశలింగంగారి గాడిదకథలతోఁ బాటు విధవా ఘోషలతోఁ బాటు నీతిచంద్రికయు, మఱి కొన్ని చక్కని గ్రంథములును మనకు లభించినవి. వడ్డాది సుబ్బరాయఁడుగారును కాలేజీలో అధ్యాపకులై చాలగ్రంథముల వ్రాసిరి. వీరికవనమున సరళగమనము తక్కువ. ఏరు కొనుపదములలో పొందికకన్పట్టదు. నడకపట్టి పట్టియుండును. కాని భావములు చాలసరసములు.

ఇప్పుడే తెలుగునాటకము లవతరించినవి. ఇతరగ్రంథములవలెనే మొదటిస్థితి సంస్కృత నాటకాంధ్రీకరణము. బళ్ళారివారి చిత్రనళీయము, చిలకమర్తివారి గయోపాఖ్యానాదులు దక్క నూటికి ఎనుబది సంస్కృత మునుండియే దిగినవి. సుబ్బారాయడుగారి శతకములు నాటకములు, చాలగలవు. భక్తచింతామణిగణనకెక్కుటకు బ్రహ్మసమాజమతముతోడ్పడినది. వారిశిష్యులు వారిదగ్గర చదువుభాగ్యము తమకుగదా యబ్బెనని గర్వించి చెప్పుటవారిబోధన శక్తి తెలువును. చిలకమర్తివారు నవలలుగూడరచించిరి. వీరిశైలిచాల సులభము. పేలవమని కొందరందురేమోకాని సామాన్యమును భాగుగనాకర్షింపగలది. వేదము వేంకటరాయశాస్త్రిగారి వ్యాఖ్యానము లమూల్యములు. వీరిపాండిత్యము పూర్వ

పండితతుల్యత నందఁగలది. ఆముక్తమాల్యద మున్నగు పెక్కులీయన వ్యాఖ్యలువడసినవి. కాని వీరు కవిత్వమును వ్రాయఁబూనుట భాషాసరస్వతికిఁ జిన్నచూపేయనుట సాహసముకాదు. మల్లినాథుఁడు కాళిదాసాది మహాకవుల వ్యాఖ్యాతయేకాని కవిత్వవాణి వానిదఱి చేరనొల్లదు. వెంకట్రాయశాస్త్రిగారు నక్లేభాషకుజనకసములు గావచ్చునుగానియన్యభాగమనేచ్ఛ నొందుట ప్రమాదవశమే, వీరేశలింగముగారు వసురాయలు వేదమువారు సంస్కృతమునుండి నాటకములఁ దెనింగించిరి కాని వీరిలో వీరేశలింగముగారి చేఁతయే మధురము. వీరి శాకుంతలము హృద్యమైనది. వీరికిపూర్వము మాడభూషివారు (ఆచార్యుఁడు) సుప్రసిద్ధులు. ఏనాఁడో భట్టుకవి కనుపఱచి విడిచిన శతవధానప్రజ్ఞల నీయన పునరుద్ధరించి సరసకవిత్వమునుఁ జెప్పెను.

ఈయదనున బ్రహ్మశ్రీ తిరుపతి వేంకటేశ్వరులు (కవిద్వయము) ఆంధ్రవాణినిఁ బోషింప బద్ధకంకణులైరి. శేషాద్రిరమణకవులు, వేంకటపార్వతీశ్వరులు, వేంకటరామకృష్ణకవులు, మఱి యిమిటేషన్ రాలవలె పిల్లపిల్లకవులు (అందరు జంటలేకాని దంటలుకానరారు) తెలుఁగు వాణికి యథాశక్తి సేవసల్పిరి. శేషాద్రిరమణకవులు పాఠశాలలలోవారే. వీరు వ్రాయుచు కొన్నిపరిశోధించుచు, విమర్శించుచు భాషాసేవకులైరి వేంకటరామకృష్ణకవుల కవిత్వము రసవంతమే. వీరు వృద్ధిలోనికి రాఁదగినవారే కాని వాదప్రతివాదములలో

ముధా ప్రతిభులై పూర్వకవుల యపరాధములు, కోకిలకాక ములు, వీనితో గడపిరి. వేంకటపార్వతీశ్వరకవులు సరసకవు లేకాని వీరినవలలు చాలవరకు ననువాదములే (బంగాళీ లోనివి) వీరిగీతములు చదువుటకు చవులుగొలుపునవే వీరిప కాంత సేవమనుగడగలదియనినమ్మెదను.

"వింటేభారతము వినవలె తింటేగారెలు తినవలె" నన్నట్లు ప్రసిద్ధభారతమునకు గీరతము వ్రాసి, భారతనాటక ములురచించి 'జెండాపై కపిరాజు,' 'చెల్లియొ చెల్లకో తమరు చేసినయెగ్గులు' కండ్లకుకట్టి ఆంధ్ర దేశమును తమశిష్యులతో నింపి నవీనమగు సులభశైలి, మార్దవము, అభిప్రాయ గౌరవ ముగలవారై శతవధానములాచరించి దిగ్విజయముగావించి తిరుపతి వెంకటేశ్వరకవులు నానారాజసందర్శన గ్రంథకర్త లైరి. వీరు విశాఖదత్తుఁడు మున్నగు వారిని తెనిఁగించిరి. ఆంధ్రభాష శృంగారవతియై దేశమంతయు నృత్యముసల్పినది. ఉద్యోగము కొఱకు హూణభాషాదాసులగు దినములలో తెలుఁగుబాస చదువవలయుననునభిలాష వీరివలన జనించినది. వీరి దేవీభాగవతము, శ్రవణానందము బుద్ధచరిత్రము శాశ్వత గ్రంథములలో చేరగలవు. వీరుప్రబంధ నాటక శతక కవులు. అష్టకములు శుకరంభాసంవాదముకామేశ్వరీ శతకము చదువ దగినవి. వీరికలమునవెలువడిన ప్రతిగ్రంథము రసముచిప్పిలు ననిన నధికోక్తిగాజాలదు. అడవి సాంబశివకవి దాసుశ్రీరా ములుగార్లు ప్రఖ్యాతిగన్నవారు దాసువారి దేవీభాగవత

ముత్కృష్టమైనది. పానుగంటివారు వచనమునకు మెఱుగుదీ గె వంటివారు. వీరి జంఘూలుఁడుచాలవిమర్శకుఁడు. ఇంగ్లీషు నిలో Addison, Goldsmith లను స్ఫురణకుదెచ్చును, వీరినాట కములును హాస్యరసమున రంజింపఁ జేయునవే.

ఆంగ్లభాషానుసారిణియై తెలుఁగుభారతి నూత్నపథ ముల నడుగులిడసాగినది. గురజాడ అప్పారావుగారి కన్యా శుల్కము ఉత్కృష్ట గ్రంథమును వైమర్శకమును సాంఘి కోత్తమమునగును గాని భాషాసాంకర్యమొక భిన్నాభిప్రాయ కారణమగుచున్నది. గ్రామ్యవాదములు పెచ్చు పెరిగినవి. అట్టి సమయమునను కేతవరపు వేంకటశాస్త్రిగారి గ్రాంథిక వచన రచనములు పండితుల కంధకారమున వెలుఁగు దివ్వె లైనవి. బ్రహ్మయ్యశాస్త్రిగారు నీవిషయమున గౌరవనీయులు. వీరివిమర్శనలు మంచివి. కేతవరపువారి రాయచూరు యుద్ధ మువారిమనీషను చాటుచున్నది. అటుపైన మహాపురుషుల జీవితములు (biographies) వ్రాయు సంకల్పము లంకురించినవి.

వీ రేశలింగముగారి కవులచరిత్రతో గురజాడ శ్రీరామ మూర్తిగారికవిజీవితములు బయలువెడలెను. ఆంధ్రపత్రిక ఆం ధ్ర కేసరి, కృష్ణాగోదావర్యాది పత్రికలు తలచూపినవి. ఇం దాంధ్రపత్రిక కృష్ణాపత్రికలే చెప్పదగినవి. కృష్ణాసంపాద కులు కృష్ణారావుగారి వ్రాతలు భావవ్రాతములు. భాషాసేవ యొనర్చుచున్న ప్రముఖులలో, వంగూరి సుబ్బారావుగారు చెలికాని లచ్చారావుగారు చిలుకూరి వీరభద్రరావుగారు,

జయంతి రామయ్యగారు కొమర్రాజు లక్ష్మణ రావుగారు ప్రశస్తిగాంచిన నర్షులు. వీరు దేశసేవ సేయుచు చరిత్రలు పరిశోధించుచు సంచారము చేసి అముద్రిత గ్రంథములు వెదకి శాసనములు చూచి ప్రకటించుచు వచ్చిరి. వీరి సేవ అమూల్యము. ఇంగ్లీషుబడులలో చెప్పు అబద్ధచరిత్రలు హిందువుల ననాగరికులని పశుతుల్యులని చెప్పుకాలమున నిట్టివారి పరిశోధనలే సత్యాన్వేషణమున కాధారములు. వేలూరి సత్యనారాయణగారివిఇటస్మరణీయములే. భాషావీక్షణములు నలుదిక్కుల ప్రసరించుటచే, ప్రకృతిశాస్త్రములు, చరిత్రలు, రాజకీయములునగు గ్రంథములు పురికొల్పఁబడినవి. రాజప్రాసాదములనుండి బయటపడి, పెద్దనాదుల తూగుటుయ్యాలలనుండిజారి, ప్రభువుల సన్మానములరోసి తెలుగువాణి ముద్రాలయాధికారులఁ జాలినిఁ బెలుగుచు, పరనాగరక సాంప్రదాయముల కలోనై విమృక్షుపీడి యూఁతనిచ్చినవారి నెల్లదిక్కని నమ్మి పత్రికాప్రాచుర్యమున కాలముగడపు రోజులు ప్రాప్తిల్లినవి.

'వేషభాషలకట వెట్టికాదు' 'ఉదరపోషణార్థమయం పటాటోపః' అనిదుస్తులుధరించు బాలకవికూటములనుఁ గని తెలుఁగుభారతి భ్రాంతివడినది దృక్పథము మార్చినది. చలచిత్తయైనది. సమాజములు, సమితులు, కుటీరములు లేననెత్తినది. ఏమిచేయఁగలదు. ఆంధ్రవాణినాదరించు నంతఃపురములడుగంటినవి. సన్మానించుసభలు సమసినవి.

ఇప్పుడు తన్ను ప్రతిఘటించి తనపేరుతో వెలసి సంప్రదాయసిద్ధములగు లక్షణములు వీడి క్రొత్తపోకడల కులుకు భారతాంగనలవినోదములమనోవేదన వడినది. నవ్వింపయత్నించుమోటు దనమునకు జుగుప్స వడుచున్నది. బూతుసంచికలవంటి విపరీతయువకుల యున్మాదలేఖల వెలవెలఁబోవుచున్నది. సంప్రదాయముగల కుటుంబములఁ బుట్టిమెట్టిన చోటుల పుణ్యమొదవించి గృహలక్ష్ములు కాఁగల సేవాధురీణల కెదురు చూచుచున్నది. పెడదారుల ద్రొక్కని పిన్న పెద్దలకు భిక్షవెట్టుచున్నది. అభిమానించు ప్రభూనాశ్రయములు పరిషత్తులు పాడువడిన్నవి. తావులేక తలదాచుకొనుట కున్మాదినియై యోర్మిదూలినది. గుంటూరు గుంటల నెల్లూరు నెఱజాణల యూసుల నుస్సు రుస్సు రనుచు రైలు ప్రయాణములలోచిక్కి మాలిన్యమంటి విలపించుచున్నది.ఇటీవల కృష్ణాపత్రికలో 'రసమంజరి'గనికొంతవికసింపనుత్సహించినది. బందరులో'శారద'గనిసంతోషపారవశ్యమునందినది.

గ్రహదశలు మాఱుచుండును. రాయప్రోలు సుబ్బారావుగారి కవితాంజలి,జడకుచ్చులు మొదలగువానితోనొక్కొక్కతఱికులుకును. సెలయేటి గానమువినును. కాలకాంతఁ గనినవ్వును. హంపీయాత్ర దలఁచికొనిన కొలది విలపించును. ఆంధ్రప్రశస్తిగనియట్టెనిట్టూర్చును. ఏకాంత సేవల కెఱగును. తొలఁకరితొంగిచూచును. మఱియుభావకవులప్రభావమునకుఁ దాళఁజాలకప్రాలుమాలియుండును. ఆంధ్రపత్రికలలోనిసారస్వతానుబంధముపై కొన్నినాళ్లు దృష్టిఁ బఱపి విధినిదూఱుచూ

(వేషధారులగు పాశ్చాత్య విద్యాగరిష్ఠుల కరస్పర్శకు) నొక కంటనీరు గార్చుచు కాలము పుచ్చుచున్నది. తెలుగుభాష సాహితీపటిమ, భావమనుపేర పెద్దయలలో మునిఁగి తేలినది. దరిగానక యున్నది. కిన్నరభాషిణి యగు తెలుగు భారతి మంజులక్వాణములు ప్రణయప్రశాంత్యాదుల యుపసర్గనిసర్గల లోఁబడిలీనమైనది. హోరుమనియేడ్చునవయువకులగనినివ్వెర వడుచున్నది. లేనిపోని విరహతాపముల వేగివేసరి ఇరుగు పొరుగుల విసిగించువెంగలి మక్కువలకు వెగటువడుచున్నది. భావకవులు మున్నగు వారి పంసుగకట్నములందియు, ఇంగ్లీషు చదువరుల నిరంతర బలాత్కారణమున వెఱగువడుచున్నది. తలమాపుసూపు పెద్దచుట్టులఁ గని సాహితికిఁ దూరదూరముగ పరుగిడుచున్నది.

ఇట్టి వర్తమానస్థితిని క్రొత్తనాగరికుల(Romance)లకు రోయుచు చిల్లరకవుల చేతుల గొల్లు మనుచు, (Mystic) (అయోమయగుప్తార్థ)రచనలచేరనసముద్రోదకముల భావకల్లోల తరంగముల నుక్కిరిబిక్కిరియగుచు ఆంధ్రసరస్వతి యీదులాడుచున్నది. పాశ్చాత్యకవ్యాదర్శములే పీడాకారణములని నేను చెప్పను. అందమూల్యరత్నములు ప్రకాశించుచునే యున్నవి. చెట్టు చెడుకాలమున కుక్కమూతిపిందెలనునట్లుభాషావృక్షము వెఱ్ఱితలలు వేయుచున్నదా యనుసంశయము పలువురకు గలుగుచున్నది. 'తొలకరిమెఱుపుల' వంటివి మంటిలోమణులవలె నేటికిని మెఱయుటచే సూర్యచంద్రులు గతితప్పక ఋతుధర్మములు తలక్రిందులు కాకుండ

టచే కలకంఠ మనోజ్ఞములగు నామని వేళల పూలగుత్తులతో కారుమబ్బులఁ బాసినశరద్రాత్రుల వెన్నెలలలో, నెడనెడనేకొంద రేని కాలకాంతానురక్తినిసూత్రగాని అభిమతముదీఱఁగావించు బుజ్జగింపులతో కలికర్ణానందములగు గీతములతో కవితాసరస్వతికప్పుడప్పుడు మాఱటనొంద తావలమేర్పడుచున్న

భాషాజీవితములలో నవస్థాభేదము లేదేశమున నైన గానవచ్చును. ఇదియు నట్టివానిలో నొకటియని సమాధానము చెప్పినచో తెలుగుకైతకు మతిభ్రంశతుల్యమగు నవస్థయని చూపర నిర్ణయింతురేమో! వనకుమారులను, కృషీవలులను గని వనట మఱచును. సుక్షేత్రముల స్వైరవిహారము సలుపును. జాతిమతభేదములకు ప్రాధాన్యమొసగక "గుణాః పూజాస్థానం గుణిషు నచలింగం నచవయః" యని పిరదౌసీవంటికవుల తలచికొనుచుండును. బౌద్ధాగమమైన సౌందరనందమును నభినందించును.

వెఱ్ఱికి వెయ్యివిధములుగదా. కొంతకాలము లేఖనవైచిత్ర్యమును, కళాభిజ్ఞతయు, శిల్పనైపుణ్యమును, ప్రకృతిసౌందర్యమునెల్ల శివుని పెంజడల వంటి పెద్దజుట్టులలో కట్టిపెట్ట నూహించిరి, నాఁడు భాషాసతికి 'పరమనీచ' దినమేకాఁబోలు.

అంధకారములోనుంచి యదేపనిగానల్లాడఁజేసి దేవురింపఁజేయు కృష్ణపక్షములువచ్చినను కొలఁది వెలుతురే నొసఁగికనులకుకట్టినట్టులుగఁజూపి బయలుపెట్టఁగల శుక్లపక్షములు వానివెనుకనే వచ్చుచుండునుగదా.

రాజమండ్రి రామమోహనప్రెస్ నందు ఒకటవపేజీనుండి
34 పేజీవరకు ముద్రితము. 1935.

శ్రీరస్తు

HISTORY OF DRAMA

కావ్యేషు నాటకా రమ్యాః.

కవికృతమైనది కావ్యము గదా. అవి ద్వివిధము లగుచున్నవి. శ్రవ్యములు, దృశ్యములు. శ్రవ్యములు ప్రదర్శనీయములు గామి శ్రోత్రప్రియములు. ఇట్టివి విజయవిలాసము మనుచరిత్రము మొదలగు ప్రబంధములు నితరగ్రంథములు; దృశ్యములు, నేత్రానందకరము లగునవి. చిత్రనళీయము, హరిశ్చంద్ర, పాండవవిజయము, శాకుంతలము వీనిలోఁ జేరినవి.

గ్రంథరచన మనిన నీకాలమున 'నంబికొండయ'వలెనైనది. త్రుటిప్రాయముగ భావింపఁబడును. పరీక్షలు తప్పిన ప్రతివిద్యార్థియు తీఱికగల యెల్ల ఇంగ్లీషు విద్యాగరిషులు కట్టగట్టి సమకట్టిన యవలీల ప్రయత్నము. సరి, విద్వాన్ ఉభయభాషాప్రవీణలకు చదువఁదలఁచిన వారి కుగ్గుపాలే కవిత్వము. అందులో క్రొత్తపద్ధతియైన మఱి మంచిది. ఇక సంస్కృత శిరోమణులకు జన్మహక్కే యగుచున్నది. పూర్వకాలమున

అనఁగాభూమిపుట్టిన(శైశవదశలో)(When the earth was young) రోజులలోనని, నేటి మనసంకరపండితులు వ్యవహరింపని కాలమున, ఆత్మసాక్షి (Conscience) గల కాలమున, నాగరకత మితిమీఱని కాలమున అట్టి పంతముబట్టి రచించు సాహసమున కొడిగట్టువారు లేరని నాయూహ. శాస్త్రశిక్షణము నొంది సాహిత్య జ్ఞానము సంపాదించి లోకవ్యవహారములు దెలిసి శుచిగలవారై ప్రతిభాపూర్ణులై, కారయిత్రీ భావయిత్రీ శక్తియుక్తులై, భుక్తికి వెదకు నవసరము లేనివారై తీఱికలు గలిగి ప్రభువుల సన్మానాదరముల సంతుష్టిపడయుచు దాంభిక వృత్తులకు దూరులై భాషాసరస్వతితో ముఖాముఖి పరిసంగించుచు లక్ష్మీమందిరముల మనికిగొని యే కొందరో యర్హులగువారే యిట్టి యుత్కృష్టకృత్యములను జేయదొడఁగిరి. అట్టివారి యవ్యవహితరచనములతో నేటి మిధ్యారచనలఁ జేర్చి నేర్చుట పాతకహేతువే యగును. అందు సామాన్యగ్రంథములకు మించి నాటకరచనము కష్టతరము. దీనిలో నియమము లెక్కువ గలవు. బుద్ధివైశారద్యము అధికముగా వలయును. (Study of men and matters) కనుకనే అట్టివ్యుత్పన్నమతియగు షేక్స్పియరు మహాకవి యతీతుఁ డగుట (His characters are living and there is Psychological understanding) అట్టి నాటకరచనకు ఉపకరణములెన్ని యవసరము? పరికరములు లేక వ్రాయఁ బూను నేటి రైల్వే గ్రంథకర్తలవంటి మహామహు లెట్టి

లోకోపకర్తలో పాఠకులెఱుఁగుదురు. ప్రతిప్రయాణికుఁ డెఱుగును.

" Poets are the uncknowledged legis laters of the world"

కవులకలములు చాల సత్తువ గలవి. ఎట్టి శాసనములును, చట్టములును వానిని మించజాలవు. వీరి వ్రాతలచే క్షణములో ప్రపంచమును తారుమారు చేయవచ్చును. అందునను శ్రావ్యములకన్న ప్రత్యక్షముగఁ జూపుదృశ్యములలో నెక్కువ శక్తి గలదు. దేశమునగల సౌగ్యతలు మంచిచెడ్డలు నంత చక్కగ నేరిమనసునను నింకొకవిధముగ నాటవు. మోలియర్, బెన్ జాన్సన్, షేక్స్పియరు వారివ్రాత లెట్టి పరిణామములకు లోనయ్యెనో మిల్టన్ మున్నగు కవులలేఖిను లెట్టిశక్తిమతు లయ్యెనో ఎడ్డిసన్, గోల్డుస్మిత్, డికెన్స్ మొదలగు కర్తల యాదేశము లెట్టి ఫలవంతములో, వేయేల? వార్తాపత్రికల యుద్బోధన మెంత యమోఘమో యెంత నిరాఘాటమో (వానికి వెలిచిగదా ప్రెస్సుఆర్డినెన్సులు) ఇంగ్లీషుచదువు విద్యార్థులకు తెల్లముగాఁ గలదు. అట్టివారు కవులు. ఏభాషనైన నీపోలిక యొక్కటే. సాంఘిక దురాచారము లడుగంటుటకు కాని, రాజకీయ సమాచారముల యుద్బోధమునకు గాని, నైతికవిషయ ప్రచారమునకుగాని గ్రంథములవంటి యుపకరణములు, కవులవంటి గంధవహులు వేరెవరు? ఏకాలపు టాలోచనలు(Thinking element)అవసరవ్యత్యయములు/ Chan-

ges necessary) పద్ధతులు (Modes of life etc) ఆచార వ్యవహారములు (Habits and customs) యోగక్షేమములు (Well-being) కాని కొన్ని శతాబ్దముల పిమ్మటఁ దెలియవలె ననిన నాకాలపుకవుల వ్రాతలు దర్పణములవలె ప్రతిబింబము లీనఁగలవు. (Synchronisms and Anachronisms) సాకాల్యవైకాల్యములు కండ్లకుగట్టినట్లు చూపఁగలవు.

సంస్కృత వాఙ్మయము నిట్టివిషయముల పొడసూపఁగలదు. ఏదేశభాషయైనను మాతృకనుబట్టి తెలియఁదగినది. అదియే గ్రహణపద్ధతికి సక్రమమైనది. భాషాభివృద్ధి వాడుకపదములనుండి పాణిన్యాది పండితులచే శాసింపఁబడి సంస్కృతరూపమునొంది సలక్షణ లక్షితమై అలంకార భూషితమై పతంజల్యాది మహామహులచే విమర్శింపఁబడి బాణాదిప్రతిభాశాలుర హస్తములలోఁ బెటిగి వృత్తమైనది.

వేదములలోని ఋక్సంబోధనలే స్వగతములుగను వాని సమాధానములే ఆకాశభాషితములుగను పరిణమించి నాటక రచన ప్రారంభించియుండును. తెలుగునాటకములకు సంస్కృతకవులుదారిచూపుటయేకాక, యక్షగానములు,వీధిభాగవతములు, భోగము మేళములుకూడ మార్గము నేర్పరచినవనుటలో వైచిత్ర్యముండదు. వేదోపనిషత్పురాణేతిహాస భాష్యశాస్త్రాదిగ్రంథముల పిదప కావ్యాదర్శముల యనంతరము నాటకములు వెలువడినవి. వానిలక్షణములనిచటవిస్తరభీతి వదలివేయుదము.

నాటకములు తొలుత అంతఃపుర వినోదమున (Harem) కేర్పడినవి. రాజకార్యభారము వదలిన రాజానందము ఒక ఎత్తు, శుద్ధాంతకాంతలవినోదము, లోకజ్ఞానసంపాదనము మఱొక ఎత్తు. కనుకనే విషాదాంతములు (Tragedies) గాకుండ కట్టుబాటులు గలిగినవి. ధీరోదాత్తనాయకాది పాత్రపోషణములు శృంగార వీర ప్రాధాన్యములేయగు రచనములు, నైతికమార్గోపదేశములు పాఠములయినవి. పిదప భరతముని యుపదేశించిన నాట్యము (అభినయము) కలియుటచే నయనానందములయినవి. సర్వజనాహ్లాదకర మగుటకు సంగీతసాహిత్యసమ్మేళన మొదవినది. వీధినాటకములు, తోలుబొమ్మలలోని, రాగ, తాళాభినయము లిట్లు వృద్ధినొందినవి. నేటి సినిమాలు శక్తిక్షయము (Waste of energy) లేని (Dumbshows) మూకప్రదర్శనములు. ఇవి ఉన్నతనాగరికతకు లక్షణములట. నాటకరచనలకు బీజములు తొలుత వేదములయందే కలవు. సంబోధనలు సంభాషణము క్రమేణ రంగములుగ మారును. మఱి చంపువులలోఁ గల గద్య పద్యములు వీనికి తోడైనవి. భరతశాస్త్రము, సంగీతమున నభిమానము వీనికి దోహదములైనవి.

ఈనాటక కర్తలలో కాళిదాసుపేరు విననివా రుండరు. ఈతని అభిజ్ఞాన శాకుంతలము (German Poet Goethe) గెటీ చదివి ఆనందము పట్టఁజాలక నాట్యముచేసెనఁట! యూరపులో ప్రపంచమున నన్ని నాగరక దేశములలోఁగల భాషలలోనికిని

దీని ననువదించిరి. ఇందలి నాయకుఁడు ధీరోదాత్తుఁడు. విక్రమోర్వశీయము మాళవికాగ్నిమిత్రము వీని రచనలలోనివి. మాళవికాగ్నిమిత్ర మనునాటకము చరిత్రాత్మకమైనది. అందలి అగ్నిమిత్రుఁడు, పుష్యమిత్రుఁడు, శుంగవంశపురాజులు. ఇది ఆనాటిచరిత్రలు మున్నగు పెక్కువిషయములు దెలియఁజేయును. దీని రచనచే కాళిదాసు క్రీ. పూ 56 సం॥ ప్రాంతమువాఁడని సందేహము. చరిత్రకారు లాతని క్రీ.శ. 525-560 ప్రాంతమున నుంచిరి. భారవియును వీనిసమకాలీనుఁడే. బాణుఁడు (బాణోచ్ఛిష్ట మిదం జగత్) అనునతఁడు (కాదంబరీవచనకావ్యకర్త) కన్యాకుబ్జాధీశ్వరుఁడగు హర్షవర్ధనుని కొలువున నుండెను. ఇతఁడును 6, 7 శతాబ్దములవాఁడు. హర్షచరిత మను వచనకావ్యము రచించెను. ఈకాలముననే దండి యను కవి కావ్యాదర్శమను లక్షణగ్రంథము, దశకుమారచరిత్రము (వచనకావ్యము) వ్రాసెను. బాణుఁడు పార్వతీపరిణయము, రత్నావళి యను నాటకములు రచించెనందురు. కాని రత్నావళి హర్షునిదని నా అభిప్రాయము. హర్షుఁడు రత్నావళి, ప్రియదర్శిక, నాగానంద మను నాటకముల రచించెను. దశరూపకమున నీ రత్నావళి కూర్చిన ప్రశంసయుఁ గలదు. ఇతని నాగానందము అప్పుడు దేశమున వ్యాపించిన బౌద్ధజైన మతాదర్శములు ప్రధానముగాఁ గలది. ఇందు నాందీశ్లోకములో "బోధో జినః" అనుదానిచే స్పష్టము.

'ఉత్తరే రామచరితే భవభూతి ర్విశిష్యతే' భవభూతి యను మహాకవి 'ఉత్తరరామచరిత్ర' మను నాటకమును కరుణారసప్రధానముగా రచించెను. కాళిదాస భవభూతి సమకాలీనత్వమును చరిత్రకారు లాక్షేపించి, భవభూతిని అశోకవర్మ (యశోవర్మ) ఆస్థానకవియనియు, పిమ్మట కాశ్మీరరాజు (లలితాదిత్యుఁడు) వీని నాహ్వానించి యభిమానించెననియు కనుక 7 వ శతాబ్దానంతరమువాఁ డనియు నందురు. వీని 'మాలతీమాధవీయము' చాల ప్రశస్తికలది. స్వకల్పితకథయనితోఁచును. మహావీరచరిత్ర మనునాటకమును వీని రచనయే.

పిమ్మట విశాఖదత్తుని ముద్రారాక్షసము గలదు. చరిత్రాత్మకమైన యీ నాటకము అత్యద్భుతమైనకథ (ప్రతిభావిశేషమును చూపునది) కలది. ఇది చంద్రగుప్తునిగూర్చినకథ. ఇది 7, 8 శతాబ్దములలోనిది. భట్టనారాయణుని వేణీసంహారము క్రీ. శ. 850 తరువాత కావచ్చును. ఆనందవర్ధనుని 'ధ్వన్యాలోకము'న దీనినుండి చాల యుదాహరణములుగలవు. ఇతఁడు అనంతవర్మ కాలమువాఁడు.

'అనర్ఘరాఘవ' కర్త యగు మురారి చాల ప్రశంసనీయుఁడు. 'మురారేస్తృతీయః పంథాః' అని లోకోక్తియే వెలసినది. అర్థపదాన్వయకాఠిన్యము గలది. హరవిజయకర్త రత్నాకరుఁడు (9 వ శతాబ్దమువాఁడు) వీనిని చాల శ్లాఘించెను. సంస్కృతవిద్యార్థులు 'మురారి' చదువక విడువరు.

సుబంధుఁడు 'వాసవదత్త' రచించెను. ఈతఁడు బాణునిచే పేర్కొనఁబడుటచే అంతకుపూర్వుఁ డని చెప్పకతప్పదు.

సూత్రకాలమునాఁటివాఁ డగు పాణినియు (వైయాకరణుఁడు) నొక కవియనియు నాతఁడు పాతాళవిజయము, జాంబవతీవిజయము నను రెండుకావ్యములు రచించెననియు ప్రతీతి. తరువాత రెండువందల యేండ్లనాటి వాఁడగు (క్రీ. పూ. 500 అని కొందరు క్రీ. పూ. 150 యని కొందరు) పతంజలి మహాభాష్యమున వాసవదత్త సుమనోత్తర భైమరథీ అను మూఁడాఖ్యాయికలను పేర్కొనెను. వాటినుండి అలంకారములు, నాటకములు, మహాభాష్యముననే చెప్పఁబడిన కంసవధ, బలిబంధము (కావ్యములు) కానవచ్చుచున్నవి.

ఆధారము లంతఁగఁ గానరాని పైవాని నటుంచి, నాటకపితామహుఁడగు భాసకవిని ముందు పేర్కొనుట విధి. ఈతఁడిరువది నాటకములు రచించిన ట్లున్నది. కాని అన్నియు లభింపలేదు. (అలబ్ధములలో "కిరణావళి") యొకటి. పాణినీయ విరుద్ధప్రయోగములు పెక్కులు వీనినాటకముల నుండుటచే నితఁడు తత్పూర్వుఁడో సమకాలికుఁడో నైయుండును. (క్రీ. పూ. సుమారు 500 ప్రాంతమువాఁడేమో) ఆధునిక నాటక నియమముల ననుసరించి లేవు. సూత్రధారప్రవేశమున కంతరము మంగళాచరణము. 'ప్రస్తావన' యనుటకు బదులు 'స్థాపన' యని యున్నది. 'స్థాపన' లో కవినిగూర్చి

లేదు. వీనింబట్టి పాణిని పేర్కొను కృశాశ్వశిలాలీత్యాది ప్రాచీన నటసూత్రకారుల మతానుసరణములే యని తోచును. కాళిదాసు తన మాళవికాగ్నిమిత్రప్రస్తావనలో 'భాస సౌమిల్లకవిపుత్రాది మహాకవుల నాకటముల మ్రోల బాలుని నూతనుని తననాటకము సభ్యులకు రుచ్యమగునాయని శంకించి 'పురాణమిత్యేవ న సాధు సర్వం, నచాపికావ్యం నవమి త్యవద్యం' అని పలికియున్నాఁడు.

భాసకవివాక్కు సరళము గంభీరము. స్వభావోక్తుల నలరారును. స్వారస్యముగలవి. వీనినాటకములు, 'స్వప్నవాసవదత్త' 'ప్రతిమా' 'బాలచరిత, 'అభిషేకనాటకము' 'పాంచరాత్రము 'మధ్యమవ్యాయోగము, 'దూతవాక్యము' 'దూతఘటోత్కచము' ప్రతిజ్ఞాయౌగంధరాయణము' మొదలైనవి ఇవి రామాయణ, భాగవత, భారతముల ననుసరించినవి. వత్సరాజు చరిత్రమునుగూర్చినవి రెండు. స్వకపోలకల్పితములు, 'అవిమారకము' 'చారుదత్తము' గలవు 'ఊరుభంగము, మున్నగునవి ఏకాంకనాటకములు. వ్యాసమహర్షి చే దురాత్మ్యనిధి యని నిందాపాత్రుఁడగు దుర్యోధనుఁడు ఈతని చేత గాంభీర్యనిధియై శ్లాఘాపాత్రుఁ డయ్యెను. కాళిదాసాదులు వీనిపద్ధతుల నవలంబించినట్లు 'వీని యభిషేకనాటకము'న రావణుని యశోకవనిక వర్ణించుతఱి-

"యస్యాం న ప్రియమండనాపిమహిషీ దేవస్య మండోదరీ
స్నేహా ల్లుంపతి పల్లవాన్" ... ...

అని చెప్పినది.

కాళిదాసుని శాకుంతలములో

'నా దత్తే ప్రియమండనాపి భవతాం స్నేహేన యా పల్లవం'

అని యనుకరింపఁబడినది.

ఇట్లే వీరి 'చారుదత్తము' నాధారము చేసికొని శూద్రకుఁడు మృచ్ఛకటికమును వ్రాసి యనేకశ్లోకముల ననుసరించి యనుకరించెను. శూద్రకుని శకారశర్విలకపాత్రపోషణము హృదయంగమముగాను షేక్స్పియర్ కవినిర్మిత పాత్రలను (ఆటోలికస్ మొ॥) కొన్ని జ్ఞప్తికి తెచ్చును.

పెద్దలము, సాహిత్యకారులము, పండితుల మనుకొను భ్రాంతిమంతు లెఱుఁగని ముద్దులొలుకు నాటకము మఱొకటున్నది. అది ప్రబోధచంద్రోదయము. కృష్ణమిశ్రవిరచితము. సంస్కృత భాషలో మహాకవులు కొందఱు తలపెట్టక కొందఱు తలపెట్టి కృతార్థత నొందక విడువవలసిన హాస్యరసమిందు మిక్కిలి పొందికగ పోషింపఁబడినది. ఇది వేదాంతోపదేశము మతప్రతిష్ఠ ప్రధానాశయములుగాఁ గలిగియు సులలితకవిత్వమున నవరసభరితమై యున్నది.

పిమ్మట జయదేవ, క్షేమేంద్ర, జగద్గురు, జగన్నాథ పండితులరచనలు పెక్కు లున్నవి.

ఇట్టి సంస్కృతనాటకముల నాధారము చేసుకొని ఇటీవల నొక ఏబదియేండ్ల లోపున తెలుఁగు నాటకములు వ్రాయ మొదలిడిరి. ఆంధ్రనాటక పితామహుఁడగు బళ్ళారి కృష్ణమాచార్యకృత మగు చిత్రనళీయము, శ్రీహర్షుని 'నైషధము' భారత నలోపాఖ్యానముల నాధారము చేసికొని బయలువెడలినది. నాటకరచనమునకు కావలసినవి నవరసములు (శృంగారహాస్యకరుణా రౌద్రవీరభయానకాః బీభత్సాద్భుతశాంతరసాః) వీనికి స్థాయీభావములు (రతి ర్హాసశ్చ శోకశ్చ, క్రోధోత్సాహౌ భయం తథా, జుగుప్సావిస్మయశ్చ, శమోపిచ) (సాత్విక వ్యభిచారి) భావములు, హావ, భావ, విలాసాది చేష్టలు వీనిని గమనించి దశరూపకములు నాటకము, ప్రకరణము, భాణము, ప్రహసనము, డిమము, వ్యాయోగము, సమవాకారము, వీధి, అంకము, ఈహామృగములు, తద్భేదములు తెలిసి, నాటకలక్షణములగు నాయికానాయక విభేదములు, బిందుపతాకాదులు నెఱిఁగి వ్రాయఁ బడిన నాటకములు తెలుఁగున చాల తక్కువ. పండితకవుల రచనలను కొద్ది మాత్రములు విడిచి, రైల్వేకవుల పాత్రములు దేశక్షేమము నొల్లక కత్తిగట్టి రచించినవని చెప్పవచ్చును. ఇది (శాస్త్రపద్ధతి రచనము) చాలకాలము ప్రజామోదము వడసినది. తరువాత ఆంధ్రీకరణములు బయలుదేరినవి. వసురాయల వేణీసంహారము, శాకుంతలము, విక్రమోర్వశీయము మున్నగునవి, వేం

కటరాయశాస్త్రిగారి ఆంధ్రీకరణములు, వీరేశలింగముగారివి తలసూపినవి. ఇవియును ఆరోజులలో ప్రజలు మెచ్చిరి. ఆపై చిలకమర్తివారి ప్రసన్నయాదవము, గయోపాఖ్యానము బయలేగినవి. వీరి హాస్యోక్తులును, సులభశైలియును నిశాని దార్లగు బండితోలువాళ్ళకును, చదువరులకును నొకేవిధముగ కంఠస్థము లైనవి.

అంత విద్వత్కవులగు తిరుపతివేంకటేశ్వరకవుల భారత నాటకములు తలలెత్తినవి. మొదల నివి నాలుగై యిటీవల ఐదైనవి. అవి పాండవజననము, ప్రవాసము, ఉద్యోగము, విజయము, అశ్వమేధ మనునవి.

"శివుడుం దాండవమాడ నాడవె పిశాచీ భూతసంతాన ముల్" అనునటులు వీనింబట్టి లెక్కకులేని జననములు ప్రవాసములు పుట్టినవి.

బళ్ళారి కృష్ణమాచారిగారి ప్రోత్సాహమున నుద్భవించిన నాటక సమాజమునుబట్టి యీసరికి చాల సమాజములు (థియేటర్లు, కంపెనీలు) లేచినవి. అందు మానేపల్లివారిది పేరువడసిన దై చిలకమర్తివారివి బాగుగ ప్రదర్శించెడిది. ఈనాటక ప్రదర్శనము కాళిదాసునాడును ప్రచారములో నున్నట్లు పెక్కు నిదర్శనము లున్నవి. షేక్స్పియరు గూడ మంచినటకుండని చాలమంది యిప్పుడు తెలిసికొనినదే. భరత శాస్త్ర రచనమునుబట్టియే నాటకప్రదర్శనముల యాచార

మూహ్యము. దశరూపకములలో నృత్తనృత్యతాలలయాన్విత ప్రక్రియలఁగూర్చి చెప్పఁబడినవి. వీనిఁబట్టి నాటకప్రదర్శన ప్రాచీనత స్పష్టము. సంగీతములకు పూర్వము గౌరముండెడిది కాని, నాటకములలో వేషములు ధరించుట యనిన నైచ్యముగ భావింపఁ బడుచుండెను. అందులకు కారణము, చాలకాలము నుండి యీప్రదర్శనములు, దాసరిభాగవతుల వృత్తిగను, బ్రాహ్మణులలో కూచిపూడివారి (భాగవతుల) వృత్తిగను నిర్వహింపఁ బడుచుండెను. భామకలాపము మున్నగు వేదాంత రహస్యములు గల నాటకములు సహితము భోగకాంతలవంతునఁ జేరెను. భరత శాస్త్రానుసారమగు నభినయకౌశలము, సంగీతసమ్మేళనము గలవారగుటచే వారిపాలయ్యెను గాఁబోలు! విద్య కొంచెము తక్కువైనవారు (దాసరిభాగవతులు) వీధినాటకములు ప్రదర్శించుచుండిరి. మఱియు కొలదివారు ప్రదర్శింప జాలకయో అత్యంతప్రాచీనత (Reminiscence of Primitive or original custom) ననుసరించియో, తోలుబొమ్మల నాటకములను నేఁటికి మిగిల్చియుంచిరి. ఈ ప్రస్తుతమున్న సమాజములకు కూచిపూడివారే ఆదర్శప్రాయులు కాఁగా నివి వానిపై నభివృద్ధులుగా వచ్చును. ఆపైన వర్ణసాంకర్యము గల తక్కువజాతివారలు స్త్రీపురుషులు గలసి కూటము లేర్పడినవి. తత్సమ్మేళనకారణమునను, అన్యవృత్తి లేక తదేకవృత్తులగుట చేతను క్రమముగ దుష్టాచారములకు లోనయి (ఆహారనియ

షాదుల వీలులేక, సాంగత్యదోషములకు లోనగుటచేత, నిద్ర బాసి ఒడలెఱుంగని యభినయమునకు నవరసమగు మత్తుద్రవ్యములు గ్రోలుటవలన నైచ్య మారోపింపఁబడిన దయ్యెను. సురభీకంపెనీలు నించుమించుగ నిట్టివే. భుక్తికి లోపము లేక విద్యాధికులై మంచివృత్తిగలవారిందు చేరక, తల్లోపములు గలవారే జీతములకు కాలక్షేపములకు నిందుదిగుటచే గౌరవ హీనత తప్పనిదగుట. పూర్వమన్ననో రాజాదరమున నాటకాకప్పుడు రాజసభలలోనే యొకభాగము వేరుగ నేర్పఱచుచుండిరి. ఇప్పటికి నట్టివి కొందరు రాజుల (జమీందారుల) యాదరమున పూర్వాచారము ననుసరించుచున్నవి. నాటకరచనము కొలఁదిగ నభివృద్ధి జెందునప్పటికి బందరులో జాతీయేటరు మున్నగునవి బయలుదేరినవి. ఇప్పటికి అన్యవ్యాపారులు (Amateurs) అని, అనన్యులు (Professionals) అని యొకవిభేదమేర్పడి నాటకకళకు కొంతగౌరవమునకు తావల మేర్పడెను. వీరు పాండవనాటకములు, నేతత్కవిప్రణీతములగు ముద్రారాక్షసము మొదలగునవి వ. సు. రాయలగ్రంథములు (వేణీసంహారము etc.) చిత్రనళీయము, వేదము వేంకటరాయశాస్త్రి గారిచే రచింపఁబడిన ప్రతాపరుద్రీయము, ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణగారి రసపుత్రవిజయము, బలిజేపల్లివారి సత్యహరిశ్చంద్రీయము, వీరేశలింగంగారి శాకుంతలము లోనగు ప్రశస్తి వహించిన నాటకములు ప్రదర్శించుచుండిరి. జమీందారులు

ను (మైలవరము) ప్రోత్సాహకర్తలై సమాజములను స్థాపించిరి. ఇట్టి సమాజములు కొంతవఱకనర్థదాయకము లైనను, వీనిం జూచి ఇతర సమాజములైనను బాగుపడు నవకాశము నిచ్చు చున్నవి. పసిపిల్లల ముద్దుచేవారియశ్లీలాసభ్య చర్యలును మన మామోదించునట్లు వీరివెఱ్ఱివెఱ్ఱి యభిరుచులును (చిందులు పాటలు, తాళములును) సభ్యుల కానందదాయకములయ్యెను. జనము విఱుగఁబడి వచ్చుటచే వేనవేలు రాఁబడి గలిగి 'చెట్టు లులేనిచోట ఆముదపు చెట్టు' వలె స్వర్ణపతకములును వచ్చి వీరిపైననేఁ బడుచుండెడివి. కనులు విప్పి తెఱచిన యీనాటికైనను వారి యిప్పటి దుస్సాంగత్యములకు తావలములయిన యీసమాజములు నిందాపాత్రములని గ్రహింపకమానరు. నాటకవేషధారులనిన పోకిరీలనియు చెడిపోయినవా రనియు పల్లెటూళ్ళను నితరచోట్లను పెద్దలు నిరసించుట వీనింబట్టి యచ్చెరువుకాదు. భావప్రకటనము లేదు. బల్లత్రొక్కుట, రాగము విసరుట, చిందులసందడి, అందమని యెంచుట ప్రబలెను. వేషమునకు తెరలకు ప్రాముఖ్యమయ్యెను. అర్థజ్ఞానశూన్యత, అపస్వరముల యధికత, నెవరును దిద్ద సాహసింపరైరి. కాని బందరు మున్నగుచోట్ల చదువుకొనినవారు గల సమాజములు ప్రతిష్ఠింపఁబడుట శుభసూచకమయ్యెను. నటకులకు పోటీలు బయలుదేరి. యారీతిని నాట్యకౌశలమభివృద్ధియగు వీలుగలిగెను. పండితులు పరిశోధకులైరి. కాని సంగీతసాహిత్యముల

రెంటను ప్రజ్ఞగలవారు లభించిననే యిట్టిది సఫలమగును. ఇఁక రాజమహేంద్రవరమున చింతామణి సమాజము ప్రసిద్ధినొందెను. మంచిపాడగలవారు కొందరం దుండిరి. వెఱ్ఱి యొకటి ప్రపంచమున మనోవేగ శరవేగములమించును. ఊరూర ప్రతివర్ణమునకు సమాజములు వెలువడినవి. కవులును (Supply and demand Rates ననుసరించి) అవసరమునుబట్టి యసంఖ్యాకులైరి. కొన్నికొన్ని సమాజములకు ప్రత్యేక (Special and copyright authors) కవులుండిరి. వారికితోచిన సంగీతసారంగధరలు, విషాదసారంగధరలు, అభినవసారంగధరలు వెదజల్లిరి. ఆవిత్తులునాటిన ఆదిపురుషు లెవరో, యేముహూర్తబలమో కాని, శాఖోపశాఖలై సత్కవిప్రణీతమగు ప్రతిరూపకమునకు ఆపేరులనే, అభినవ, విషాద సంగీతములను తోలితోకలతో అంతులేనిబమ్మచెముడువలె అలముకొనుచున్నవి. ఇవియే ప్రయోణికుల చెవులఁ బద్దలుగొట్టి దిక్కులుపిక్కటిలఁ జేయుచున్నవి. ఇట్టి మహామహులకు చారిత్రరూపమున స్థానమిచ్చుటకు వెఱచి ఇంతటితో నాపుదము.

విద్వత్కవులగు తిరుపతి వేంకటేశ్వరకవుల నాటకములు ప్రచురణలోనికి వచ్చినవి. బలిజేపల్లి లక్ష్మీకాంతకవిగారి హరిశ్చంద్ర వెలువడి సర్వజనాదరణీయ మయ్యెను. అడవి వెన్నెలవలె కొప్పిడి రామకవిగారి రామనాటకము, మోహినిమున్నగునవి ప్రాచుర్యమునొందకయే మాటుమ

డఁగినవి. చిత్రనళీయ మీసరికి పాతఁగిల్లినది. ప్రజలదృక్పథము క్రొత్తనాటకములవైపు మఱలినది. కాళ్ళకూరి నారాయణ రావుగారి 'చింతామణి' వీరిమన్నన వడసినది. అది కేవల సాంఘికకథ. వారాంగనాలౌల్యము, రాధసౌశీల్యము, తత్ఫలము చక్కఁగ వర్ణింపఁబడినవి. బస్తీలలో ప్రతియింటి వెల్లగోడలపైనను 'చింతామణి' కాగితములే యయ్యెను. ఆశక మంహరింపకమునుపే తత్కవిప్రణీతములగు పద్మవ్యూహము, వరవిక్రయము వెలుతురుఁజూచినవి. 'సింగరాజు లింగరాజు'ను స్మరింపని వీధులే లేవు ఒక వెలుగు వెలిగి లింగరాజు విశ్రాంతి కేగెను. కీ॥ శే॥ ముత్తరాజు సుబ్బారావుగారు, పోతుకూచి సుబ్బయ్యగారు రచించిన శ్రీకృష్ణతులాభారములు రంగము నలంకరించుచు వచ్చినవి. ఇందు రెండవది విస్మృతిపాత్రము.

భావకవిత్వముతోఁబాటు భావప్రకటనమును నటకుల మానసముల తలసూపినది. పానుగంటి లక్ష్మీనృసింహారావు గారు ప్రచండచాణక్యము మున్నగు గద్యపద్యాత్మకములు రచించి కేవల గద్యాత్మకములగు కంఠాభరణము మొదలగు కొన్నిటిని రచించిరి. నాటకభారతి క్రొత్తదారి ద్రొక్కినది. చరిత్రలు, దేశాభ్యుదయములు మున్నగువానిపై దృష్టి మరల్చినది. పురాణేతిహాసపురుషులగు ధీరోదాత్తనాయకులు తదీయ శృంగారప్రధానరసపోషితములు విసిగించినవేమో కాని 'రోషనార' (శివాజీచరిత్రము) రాణాప్రతాపసింగు,

రామరాజు దర్శనీయములైనవి. వీరరౌద్రరసముల యాకర్షణా ము హెచ్చెను. గురజాడ అప్పారావుగారి 'కన్యాశుల్కము', విద్వత్కవుల ప్రతిభాముద్రితమైన 'ముద్రారాక్షసము' కొంతవ ఱకాదరణపాత్రములైనవి. ప్రతాపరుద్రీయమున యుగంధరుని పిచ్చిమచ్చిక యైనది. చాకలిపేరయ్యపేరు ప్రసరించినది. తిరుపతి వేంకటేశ్వరకవులు రచించిన (భాషాంతరీకృతములు) అనర్ఘనారదము, దంభవామనము మృచ్ఛకటికము నేలనో యీనటకులదృష్టిఁ బడవయ్యెను. ఒకప్పుడైనను ముందు పాండవవిజయోద్యోగములవంటి ప్రాముఖ్యము వీనికి రాఁగల దాయనుట విచార్యము. సరే, అనామకులనామరహితములు, నాటకనామమాత్రములు, బజారులయందు, రైళ్ళయందు గలవు. వానికి తావులేదు. ఆవిషయ మక్కరలేదు.

కవుల యాదేశములలో నూతనపరిణామము ననుసరించి ఏకాంకనాటకములు బయలుదేఱినవి. 'మేవాడుపతనము' కూడ నాటకరంగము జూచినది. (జేబున్నీసా, అనార్కళి, నర్తనశాల యిట్టి వేలనో గ్రంథస్థములుగనే యున్నవి.) సుప్రసిద్ధనటకులు నెల్లూరి నగరాజారావుగారు, బళ్లారి రాఘవాచార్యులు మొదలగు ప్రముఖులు భావప్రకటనమునకు వచనరచనమే సహకారియు, రసవత్తరమునని నిరూపించిరి. పాటకులు నటకులు నగు డి. వి. సుబ్బారావుగారేలనో పద్యముల నిరసింపక వారల కెనయగు చాకచక్యమునే చూపఁ గలిరి.

(Grapes are Sour అననిట్టివా? యని కొందరిసంశయము) మఱియొకముఖ్యవిషయము మృదంగతాళములతో నాట్యము సల్పియు వాని వదలి రాగమును క్లుప్తపఱచిన లోపము గనుపట్టనీయక ముసలిదాడల వెలితి నటుంచి సినీమాలఁజొచ్చిన సూర్యనారాయణగారు ప్రజాదృక్పథమున కానుగుణ్యమగు వచనగ్రంథముల ప్రదర్శనమునుగూడ నిర్వహింపఁబూనిన బళ్ళారివారు, ముంజులూరి, గోవిందరాజుల, స్థానంవారును పేర్కొనఁదగినవారే.

కాలముమాఱ్పెట్టిదోకాని, అసభ్యములని నాటకలక్షణముల నుండి తొలఁగించి ప్రదర్శనీయములుకావని నిషేధింపఁబడినవెన్నియో [భోజనము, త్రాగుడు, ఊరేగింపు, భజన, కత్తులుకటారులతో, సాము] రంగమునఁ జూపఁబడుట అత్యద్భుతముగ పరిగణింపఁబడుచున్నది. తబలాప్రమోత నాణెముగ నెన్నబడుచున్నది. ఇట్టి ప్రదర్శనములు నాటకములపై సదుపాయములగు సినీమాలలో (To avoid waste of energy, to Present realistic and naturalistic Pictures) జూచిన సంతుష్టిచేనైన నాటకములలో చూపకుందురుగాక.

స్వాంఘికములు, మతవిషయికములు (బైబిలు నాటకమని యిటీవలనే వినుభాగ్యమబ్బినది.) రాజకీయములు నైతికములు మున్నగు క్రొత్తనాటకములు బయలుదేరుచున్నవి. సత్కవులు [విద్వత్కవులగు వారు] ఇందులకు పూనుకొనినచో

వందనీయులు. ఇంతవరకు భిన్నసంస్థలు పెక్కులేర్పడినవి. వీరి నాటకములు (Representative Stories) కొన్ని ఆరోగ్యవారముల నాటకములు (Health week) నంకురించుటచే నిట్టి సందేహము, వృధాయనరాదు. ఇందు, ఈఁగలు దోమలునాయకోపనాయకులు. ఇక, బేట్లు బంతులు, సీసాలు వలలుమహానాయకులు కావచ్చును. Theosoph'cal, Arya Samaj, masonic, Scientific, Athletic నాటకములు వెడలకుండుట ఆలోచనీయముగ నున్నది.

దశరూపకములలో నొకటియగు 'భాణ'ము ననుసరించినవగు బొబ్బిలికథ బాలనాగమ్మకథ యిట్టివి. చరిత్రల సంబంధములు గలవియు వీరరౌద్రములు పౌరుషములు పరాక్రమములువర్ణించుటచే] రసపుష్టములు, దేశభక్త్యుత్సాహ పూరితములును, నయినను పండితపామరుల కందరకు నందుబాటు గావని నాటక కావ్యరూపములు విడిచి ప్రజాబాహుళ్యము తెలిసికొనుట కనువగుభాషలో, పూర్వరాజుల వృత్తములు కనులకు కట్టినట్లు ప్రదర్శించుటకును వీలుగ రచింపఁబడినవి. నాగరక రచనలు పెచ్చుపెరుగుటచే నవి క్రమముగ నిరసింపఁబడుచు, అడుగంటు చున్నవి.

అరిష్ట స్వరూపములగు రైల్వేనాటకములకన్న నాగరికతలేని కాలమున వెలువడిన యీరూపకము లెన్నిమడుంగులో ప్రశస్తిగలవి, రసవంతములైనవి. ఆహ్లాదకరములైనవి.

ఈ నాటికి నాటకముల రచనవిషయమై నిలిచిన యభి

ప్రాయము సంగీతము స్వాభావికమునకు విరుద్ధము గనుక అక్కఱలేదనియు, అందుచే పద్యరహితములుగా నుండవలయు ననియు నొకటి ముఖ్యము. స్త్రీపురుష సమ్మేళనములగు ప్రదర్శనముల ప్రయోజనము నేటి సమస్యలలో మఱొకటి. దాని మంచిచెడ్డలు కాలమే విమర్శించి చెప్పఁగలదు. నటకుల, తత్కౌశల వర్ణనములను గూర్చి పురాణం సూరిశాస్త్రిగారు రచించిన (నేనందుతో నేకీభవింపక పెక్కువిషయముల యాథార్థ్యమున భిన్నాభిప్రాయుఁడనే అయినను నామమాత్రముగ సూచించితిని) నాట్యాంబుజ మొందుగలదు. అందునటకుల విషయమే కలదు. నాటకముల విషయము లేదు. అందును కొన్నికొన్ని యభిమాన పూర్వకములైన విషయములై యున్నవి.

దినదినాభివృద్ధిని భావప్రకటనముకొఱకు నావేశపరులైనతఱి మాటాడలేక అభినయము సాధ్యపడక సినీమానాట్యమవలంబించుటయు పిదప ప్రతిమల ననుకరించుటయు భావిప్రదర్శనాంశములని యొకకవి సూచించెను. అట్టి యదృష్టమబ్బకుండునుగాక. కవివర్యులు యోగ్యములగు రచనలకు పూనిక వహింతురుగాక.

ప్రాచ్యబిరుదములకు పరీక్షలిచ్చితిమిగదాయని కాని, పెద్ద జీతములుగలవారమనిగాని, బి.ఏలమనికాని, తీఱికగలదని కాని జాతికులసంఘాభిమాన మున్నదిగదాయనికాని లేదా ప్రకటించు పత్రికలున్నవనికాని, కసరతుచేసి తయారైన కవులు చెలరేఁగకుందురుగాక. వివేచనాదక్షులుకానివీథిజనమేప్రేక్షకులై వస్తునిర్ణాయకులు గాకుందురుగాక.

నాటక లక్షణములు Etc.,

1. నాటకము-ప్రఖ్యాతవృత్తము, శృంగారరవీరసములలో నొక దానికి ప్రాధాన్యము. అన్యరసముల కనుప్రవేశము.
2. ప్రకరణము-ఉత్పాద్యవృత్తము, ధీరశాంత నాయకుఁడు శృంగార రసప్రాధాన్యము.
3. భాణము-ఉత్పాద్యవృత్తము, ధూర్తవిటనాయకుఁడు శృంగార వీరరసములు సూచనమాత్రసారములు.
4. ప్రహసనము-కల్ప్యము, (వృత్తము), పాషండ ప్రభృతులు నాయకులు హాస్యరసము.
5. డిమము-ప్రఖ్యాతము (,,) దేవగంధర్వ పిశాచాది ధీరోద్ధతనాయకులు (16) రౌద్ర రసప్రాధాన్యము, శృంగార వీరాను ప్రవేశము.
6. వ్యాయోగము- (,,) ధీరోద్ధతనాయకులు_వీరరస ప్రధానము.

సమవాకారము-కల్పితము కానిప్రసిద్ధము కాని దేవాసురాదినాయకులు (12) వీరరసప్రధానము.

8. వీధి— కల్పితము ,, ధీరోద్ధతనాయకులు-శృంగార రససూచనామాత్రసారత.

9. అంకము— పరిఖ్యాతము ,, ప్రాకృత జనులు నాయకులు కరుణరసప్రధానము.

10. ఈహామృగము - మిశ్రవృత్తము, ధీరోదాత్తనాయకులు శృంగారరసాభాసత్వము.

ప్రఖ్యాతవృత్తము- ప్రసిద్ధమైనది. ఉత్పాద్యము- కల్పితము. మిశ్రము-రెండుకలసినది.

నవరసములు— శృంగార, హాస్య, కరుణ, రౌద్ర, వీర, భయానక, భీభత్స, అద్భుత, శాంతములు.

11. వీనికిస్థాయీభావములు:- రతి, హాస, శోక, క్రోధ, కోప, రోష, ఉత్సాహ, భయ, జుగుప్సా, విస్మయ, శమములు.

విభావానుభావసాత్త్వికవ్యభిచారిసామగ్రీ సముల్లాసితస్థాయీభావము రసము. ఇది అంకురితత్వ, కుసుమితత్వ, పల్లవితత్వ, ఫలితత్వహేతువుగ నభివృద్ధి నొందును.

విభావములు— (2) ఆలంబన, ఉద్దీపన

అనుభావములు- కటాక్షాది శరీరజములు.

సాత్త్వికభావములు-(8) స్తంభ, ప్రళయ, రోమాంచ, స్వేద, వైవర్ణ్య వేపథు, అశ్రు, వైస్వర్యములు.

వ్యభిచారిభావములు - నిర్వేదము, గ్లాని, శంక, అసూయ, మద, శ్రమ, ఆలస్య, దైన్య, చింత, మోహ, స్మృతి, ధృతి, వ్రీడ, చపలత, హర్ష, ఆవేగ, జడత, గర్వ, విషాద, ఔత్సుక్య, నిద్ర, అపస్మార, సుప్తి, విబోధ, అమర్ష, అవహిత్థ, ఉగ్రత, మతి, వ్యాధి ఉన్మాద, మరణ, త్రాస, వితర్కములు.

భావమునకు- శాంతి, ఉదయ, సంధి, శబలత-యనికలవు.

శృంగారచేష్టలు- భావ, హావ, హేల, మాధుర్య, ధైర్య, లీల, విలాస, విచ్ఛిత్తి, విభ్రమ, కిలికించిత, మోట్టాయిత, కుట్టమిత, బిబ్బోక, లలిత, కుతూహల, చకిత విహృత, హసితములు.

అవస్థలు- చక్షుః ప్రీతి, మనస్సంగ, సంకల్ప, ప్రలాప, జాగర, కార్శ్య, అరతి, లజ్జాత్యాగ, జ్వర, మూర్ఛలు,

నాయకులగుణములు- మహాకులీనత, ఔజ్జ్వల్యము, మహాభాగ్యము, ఉదారత, తేజస్వీత, విదగ్ధత్వము, ధార్మికత్వము, మహామహిమత్వము, పాండిత్యము, స్వరూపము

స్వరూపము- యశః ప్రతాపముల సుభగత్వము, ధర్మకామార్థతత్పరత్వము, ధురీణత గుణాఢ్యత్వము,

భేదములు(విశేషములు)-ధీరోదాత్త, ధీరోద్ధత, ధీరలలిత, ధీరశాంతులు,

శృంగారనాయకులు- అనుకూల, దక్షిణ, ధృష్ట, శఠులు,

వీరికినాయికానుకూలమందు- కొంచెము ఊనస్వభావముగల పీఠమర్ద, ఏకవిద్యుఁడగు విట,సంధానకుశలుఁడగుచేట, హాస్యప్రియుఁడగు విదూషక అనువారు,

శృంగారనాయికలు- స్వాధీనపతిక, వాసకసజ్జిక, విరహోత్కంఠిత. విప్రలబ్ధ, ఖండిత, కలహాంతరిత, ప్రోషితభర్తృక, అభిసారిక.

వీరిలో- పద్మినీ, చిత్తినీ, హస్తిని, శంకిణీ మున్నగు లక్షణభేదములును, ముగ్ధ, మధ్యమ, ప్రౌఢ, మున్నగు వయోభావ భేదములు గలవు.

వీరికి (నాయికలకు)- నాయకానుకూలమందు దాసీ, సఖీ, కారూ (రజకీమున్నగు), ధాత్రేయి (ఉపమాతృసుత), ప్రతివేశినీ (సమీపగృహవర్తినీ), లింగినీ (పరివ్రాజిక) శిల్పినీ, స్వా (స్వయం, భగినీస్యాలికమాతులసుత)-అను

వారు. ఇట్టి దృశ్యప్రబంధములకు సామా
న్యముగా వలయు నుపకరణములు.

1. వివక్షితార్థ ప్రతిపాదనము
2. గోప్యార్థ గోపనము.
3. ప్రకాశార్థ ప్రకాశనము
4 అభినయ రాగసమృద్ధి
5. చమత్కారిత్వము.
6. ఇతివృత్తి విస్తరణ. 1 సూచ్యము } అనిద్వివిధము.
2 అసూచ్యము

దృశ్యము. శ్రవ్యము.

నాటకమున కాది—సూత్రధారుని ప్రవేశానంతరము, గృహిణీ నటీ మారిష పారిపార్శ్వక నర్మసచివ విదూషకుల ప్రస్తావనతో ముగియును.

ప్రస్తావన (ప్రరోచన)-ప్రస్తావనము ప్రవర్తక ప్రయోగాతిశయము.

ఇది గూఢార్థపద పర్యాయమాల, ప్రశ్నోత్తర రూపమునను అన్యకారణమిషచేతదన్యకార్యకరణ్యము అన్యకార్య ప్రసంగమున ప్రకృతకార్యసిద్ధియు గలది.

ఇందలి భాగముల పరిభాష పూర్వరంగము Prologue or prelude of a drama (రూపకము ననుసరించి కథాసామగ్రి. ననుసరించి అంకములుండును.)

అందుమధ్యవచ్చునవి:—

విష్కంభము:- మధ్యపాత్రలచే జరుగుచున్న కథావిషయములు సంక్షేపము గాఁజెప్పఁబడును. ఇది శుద్ధము సంకీర్ణము ప్రకృతిప్రాయము మిశ్రమమైనది.

అంకాస్యము:— అంకాంతపాత్రలచే ఉత్తరాంకార్థ సూచన కలది.

ప్రవేశము- ఆద్యంకమునగాక పాత్రప్రయోజితముగ పూర్వాంకాంతపాత్రలచే ఉత్తరాంకార్థము సూచింపఁబడునది.

అంకావతరణము- పూర్వాంకార్థము ననుసంగతమై ఉత్తరాంకార్థమునఁ గలది. సూచింపఁ బడ్డని అంకపాత్రముగలది, అంకావతరణము.

అంకము- ప్రత్యక్షనేతృచరితముగలది, బిందువ్యాప్తిపురస్కృతమైనది, నానార్థ ప్రకారార్థ సంవిధానరసాశ్రయమైనది.

ఆముఖము- సూత్రధారుఁడు పైఁజెప్పబడిన నటీ మారిపాదులతో స్వకార్య ప్రస్తుతాక్షేపములైన చిత్రోక్తులతో ప్రసంగించునది.

ప్రస్తావన- ఇందలి కథోద్ఘాతమున స్వవృత్త సమవాక్యార్థము లందికొని పాత్ర ప్రవేశమగున ట్లుండ వలెను.

నాన్ది- 8, 12, 18, 22, అక్షరములు గలిగి అర్థమునఁగాని శబ్దములఁగాని కావ్యార్థసూచనముగలది. మంగళార్థ పదోజ్జ్వలమై ఆసీర్నమస్క్రియా వస్తునిర్దేశరూపము గలది.

సంహృతి- కార్యార్థోప సంహారము.

మంగళం- శుభశంసనము ప్రశస్తి గలది.

మఱియు నాటకములకు ఇంగ్లీషునవలెనే ఐదుభాగములు గలవు. వీనికి పంచసంధు లనిపేరు.

1. ముఖము- Entrance, opening (Exposition.)
2. ప్రతిముఖము-Secondary plot, or incident to tend to hasten or retard the catastrophe (Expansion)
3. గర్భము-Interior (climax)
4. విమర్శన-Deliberation, Conflicting judgment, the impression left on the mind by the past good or bad actions (Expostulation, reflection or revelation.)
5. నిర్వాహణము-The last stage in which the action or the play is brought to a head. Denoument (catastrophe.) ఇట్టి వైదు ఉపకరణములు గలవు.

1. బీజము-The seed or germ of the plot of a play, story etct
2. బిందు -The sudden development of a secondary plo (incident) which like a drop of oil in water

quickly diffuses itself; and thus supplies important elements in the development of the plot. It is the source of an intermediate object while the 'Bija' is that of the Principal one.

3. పతాక-An Episode Intimation of an episodical incident when instead of the thing thought of or expected, an other of the same character is brought in by som unexpected circumstance.

4. ప్రకరి-An interlude or Episode insreted in a drama to explain what is to follow.

5. కార్యం-The denoument (culmination) of a drama.

మఱియు నింక నైదుభాగములకు వలయు 64 విశేషాంశములు గలవు. కాని ప్రకృతమున నవి దురవగాహాము లగుట గ్రంథవిస్తరభీతి వదలితిని.

సంగీతము - సాహిత్యము

"సంగఃకస్య హి నస్వదేత మనసే మాధ్వీకమృద్వీకయోః"

ఒక విషయమును తొలుతనే నిర్వచించుట సులభసాధ్యముకాదు. అట్లు యత్నించుటయు వివేకిసమ్మతము కాదు. లక్షణలక్ష్యము లుదాహరించి, వాచికాంగిక విషయము లుపలక్షించి, యౌగికరూఢార్థములు సమన్వయించి శబ్దనిష్పత్తిరూపించి భేదసాదృశ్యములు వివరించి సమాకరించిన కొంత నిర్వచనప్రయోజన ముండఁగలదు; కాని సూత్రప్రాయముగ తెల్పుట నరివడనిది. గురోర్భావం గౌరవం, నటస్య భావం నాట్యం అని చెప్పుపెద్దలకు దానిభావమెంత తదుర్బోధమో వినువారికి నంతే యగును. సాంకర్యమున కర్థము చెప్పుచు సమ్యక్కరోతీతి సంకరః తస్యభావం సాంకర్యమని యొకపండితునినోట విని నేను విన్నబోతిని. అట్లే సంగీతమునకు సమ్యగ్గీయతే' యనుట సులభవాదము. ఈ 'బాగుగా పాడుటకు మితియేది? గతియేది? దాసరి భాగవతులు పదిమందిచేరి గోల చేయుచు బాగుగ పాడుచున్నట్లు తలఁపనిచో వారాపాట కెట్లుద్యమింతురు? భోజనసమయములలో దినువారి యాకులలో అడుగులదుమ్ము రాలుననియైన వెఱువక, వడ్డనల కడ్డమనియైన మానక ఇద్దరుముగ్గురు కలసి పండ్లూడిన చప్పిదాడలతో, అరచిన హడావిడిచే బొంగురువోయిన గొంతుకలతో

పరుగులెత్తిన యలసటచే కారుచు వంక్తి వారినిముంచి యెత్తు చెమటవానతో, తరంగములు పాడుటయెందులకు ? ఇది సంగీత మగునా కాదా ? మఱి దీని నిర్వచనమెట్లు ?

పోనిండు సాహిత్యముమాట. సహితస్యభావం. సహితస్యధర్మః, సహితస్యసంబంధీ. ఇందేదైనను సుబోధకమై మన మనుదినము వాడుకొను నర్థమున కిమిడియున్నదా ? కొందరు బుద్ధిమంతులు వీనికి అన్యపదములు కొన్నిచేర్చి యేదో చెప్పుదురు. కనుక మనప్రకృతాంశము కేవలమా శబ్దముననున్న దానిని నిష్పన్నముచేయుట చాలదనియే. భాష్యకారుఁడు చెప్పినట్లు లోకోక్కప్పుడు దాని యాకృతి, గుణములు మున్నగునవెన్నో తెలియఁజెప్పవలయును. తర్కశాస్త్రమున నిది విధింపఁబడినది. నిర్వచించుటకు గల పద్ధతులు పెక్కులున్నవి. ఒకవిషయమును గూర్చి చెప్పుచో తద్ధర్మములు, తద్భేదసాదృశ్యములు తత్కార్యకారణములు తదాభాసములు కూడ ప్రాసంగికముగా ప్రయోజనకారులగును. అందుచే పైవ్యాసవిషయములకు నిర్వచనయత్నము తలపెట్టక కొంతవడి వానిని చర్చించుటయే యవసరము.

సంగీతసాహిత్యములనుట మనమెప్పుడు వినుచున్నదే. 'కూనరాగము తీయలేని మగవాడు కుడుములు వండలేనియాడుది యుండరని వాడుక. రెండవది యీరోజులలో కల్లయే కాని సామెత సలక్షణమగుటకు 'కూనరాగము తీయలేనివారు

కుంటికవిత్వము చెప్పలేనివారు' ననుట ప్రమాణపక్షము. ఈ రెండును నేడందరి సొత్తయినవి. ఈ వఱకు 'గాంధర్వంచ కవిత్వంచ...అభ్యాసేన న లభ్యంతే...సహజాగుణాః' యని చెప్పుచువచ్చిరి. ఇప్పుడది మాఱుటకు తగిన హేతువులు లేక పోలేదు. పూర్వము పెద్దలయెడ గౌరవము, పెట్టిపుట్టినవారు కొందరుందురను నమ్మిక, ఆత్మవిచారము, తనకు నితరులకు గల తారతమ్యచింతనము, సిగ్గుబిడియములు గలిగియుండిరి. అధునాతనమున ఎవరికివారే కవిబ్రహ్మలు, తిలకలు, గాయక శిఖామణులు, అవతంసులు. మఱియొక భేదము, నాడు సంగీత మనునది యొకేవస్తువు. 'స్వరరాగసుధా' యని 'సంగీతశాస్త్ర జ్ఞాన' మని, 'సంగీతమే సారూప్యము, సాయుజ్యము'నని 'శిశుర్వేత్తి పశుర్వేత్తివేత్తిగానరసం ఫణిః' అని యెద్దానిసారము గలదో యదియే సంగీతమను వెఱ్ఱినమ్మకముండెడిది. ఇప్పుడో వివిధశాఖల విస్తరిల్లినది. ఒకప్పుడు పెద్దతరగతి విద్యార్థిని భాగవతమును గూర్చి ప్రశ్నింపఁగా వచ్చిన సమాధానము— మహాభాగవతము, దాసరి భాగవతము, కూచిపూడి భాగవతము నందలి విభాగములని. కోతులభాగవతమో యని తిరిగి వంతులడుగవలసి వచ్చెను. అట్లే భారతము, ఆంధ్రమహాభారతము చేటభారతము. ప్రకృతము సంగీతములో—

శాస్త్ర (కట్టు) సంగీతము, కంపెనీస్టైయిల్ (నాటకకత్తు) సంగీతము, గ్రామఫోనుసంగీతము, పురాణసంగీతము,

తెలుఁగు పంతుళ్ల వాచకసంగీతము ముఖ్యమైనది పెండ్లిసంగీతము. ఇంకొకటి కూడ కలదు. ఇమిటేషన్ (అనుకరణ) సంగీతము అదే గవాయిసంగీతము (గాండ్ గోండ్ మాండ్ గౌను, మాల్గౌను మొదలైనవి). మఱొకటి చర్చిప్రార్థనలలో క్రైస్తవులుతీయు బైబిలుపాట రాగములు. ఇవిచాల శాఖలగుటచే పరిశోధించి నాకుతోఁచినరీతి నీవిధముగ విభాగింప మేలని తోఁచినది.

సంగీతమునకు రాగములు ప్రధానములు గనుక అందు 'విరాగములు సరాగములు పరాగములు' అని తేలికపఱచితిమి. ఇందు న్యాయసమ్మతముగ శాస్త్రసంగీతము సరాగము కావలెను. కాని చాలవఱకది సంపూర్ణ విరాగముగనే సాగుచున్నది. అర్థరీతిని పెండ్లిసంగీతము సరాగము కావలెను. ధోరణిని, ప్రత్యక్ష ప్రమాణమునుఁబట్టి, తెలుగుపండితులగు వారిది సరాగమే; కాని పెండ్లి చదువు కాక మిగిలినవన్నియు చాలవఱకు విరాగములే యగుచున్నవి. ఇందులో చేర్పఁదగినది, శాస్త్రమునకు పాడుచున్న వాని కంఠమునకు సంబంధము లేక అరమైలు దూరముగనుండి ఒకేతూఱి పదివంద్రెండు మెట్టులనొక్కి గోలచేయు హార్మోనియము సంగీతము నిట్టిదే. అందది కొంచెము ప్రాతగిల్లిన పనిముట్టయినచో దానిరణగుణ ధ్వనికి, గాలిరొత్తిడికి, రాజమహేంద్రవరమువంటి యూళ్ళలో రెండుబండ్ల పరాగము వెలువరింపఁగలదు. ఇటీవల

కొన్నికొన్ని బడులలో ఎగ్జిబిషన్ (ప్రదర్శనార్థము) సంగీతమొకటిబయలుదేరినది. దాని యుద్దేశము ఆత్మరంజనముకాని జనరంజనముకాని జ్ఞానసంపాదనముకాని కాదు. కేవలము పది మందికిచూపుటయో చూపుకొనుటయో (అడ్వర్టైజ్మెంట్ మాత్రమే). ఐనప్పటికి దీనినిగూడ శ్లాఘించువారు వేలకు వేలున్నారు. నిజమునకు వీనికే తగిన పొగడ్త యున్నది. జట్కాబండ్ల జనమునకు, వీధిజనమునకు, కిల్లీసోడా జనమునకు లాండ్రీసెలూనుల జనమునకు, 4, 5 ఫారములనుండి ఇంటర్మీడియేట్ పరీక్షవఱకుండు విద్యార్థి జనమునకు, క్రొత్తక్రొత్తగ నాగరకత నలవర్చుకొనవలె ననుకొను యువయువతీజనమునకు పై చెప్పబడినయీ గ్రామఫోను, కంపెనీ, ఇమిటేషను సంగీతములే సదానందచిదానందములను కొంచెముదాటిన పరమానందము లగుచున్నవి.

ఇప్పుడు మన మాలోచింపవలసిన విషయము వీనిలో గల విశేషమేమి? ఈ సంగీతమునఁగల భావమా? అర్థమా? ఇందేది వీరి హృదయముల నాకర్షించుచున్నది; అనునదే.

సరి,సాహిత్యమునకు వత్తము. ఇదియు పూర్వమంత ఛిన్నభిన్నములుగ లేదు. ఒకచోట నొకపండితశబ్దవ్యవహర్తుఁడు బహిరంగసభలో సాహిత్యమునుగూర్చి వచించుచు, పంచకావ్యములు, పిదప నాటకములు తదుపరి నాటకాంతే సాహి

త్యం అనినారుకనుక రసగంగాధరము, సాహిత్యరత్నా
ప్రకాశిక దీపిక మున్నగు నాలుగైదు సాహిత్యగ్రంథ
గలవనియు, శాస్త్రములు వేఱనియు, ప్రపంచమున
నాలుగే సాహిత్యగ్రంథములనియు ఘంటాప
చెప్పుచు, కనుబొమలుమీటుచు, సాహిత్యములో నిల
యీమూడునాల్గు గ్రంథములనుండి రెండుమూడు పం
హారణముల నెత్తిచూపఁగా సభ్యులలో నొకరును నవ్వక
నను మెచ్చుకపోయినను తన తెలివికి తానే ముఱ
పోయిన యమ్మహానుభావుని చూచిన మంట, జాలి
ముప్పిరిగొనినవి. మఱిచితిని ఆయన నైజధోరణియగు
పంతుల్ల సంగీతమును సభ్యుల కొంతవఱకు గగ్గోలుపఱ
నది. అప్పుడే యొక పాతానిగాయకుడో నాయుడుపాట
లేచి మఱి మాసంగీతంలో సాహిత్యమోనండీ అని నిల
యడిగినట్లును నాకు జ్ఞప్తియున్నది. అందుచే వెనుక సా
మన నేదో యొక యర్థమో యుపార్థమో యుండెడిది
నేఁడో, ఆంధ్రసాహిత్యము (పరిషత్తు), నవ్యసాహి
అభినవసాహిత్యము, గీర్వాణసాహిత్యమండలి ఇట్టి
ధారణాసంభావనాపూర్వపదకర్మధారయములుకాక ఉ
సాహిత్యార్థమున కొంతకాలమెగసిన 'సాహితి' ముక్క
వేఱొకటి, ఐదుబదులు గుణింతములతో నంతమొ
గాయకనటకగంధర్వవిద్వాంసులగు వారి వర్ణములలో

ములలోని 'సాహిత్యము' (వారి ప్రాణములకదే రసగంగా ధరము, సాహిత్యరత్నాకరము సర్వాభరణములును)—అను నిన్నిరీతుల దిగ్వేదండతుండములనుండి అండపిండబ్రహ్మాండ ములనిండి దండిగ రైలుబండిప్రయాణముల నొండగుచున్నది. ఇట్లిన్ని తెగలుగ విభాగమగుటకు కారణమరయఁగా నెట్ట కేల కొకరీతి తట్టినది. సంస్కృతమున నొక శ్లోకమున్నది. దాని యర్థము కవితాకన్యాస్వయంవరవిషయము గూర్చినది. ఆమెకు వ్యాకరణపండితుఁడు తండ్రియట, తార్కికుఁడు భ్రాత. ఛాందసుఁడు (వేదపండితుఁడు) చండాలసముఁడు (శ్రోత్రియులు పంచమున కెంతదూరమునుండి తొలఁగుదురో అట్లే ఆమెయు వాని తొలఁగిపోవునట) ఇఁక సాహిత్యకారు లను స్వయముగా వచ్చి వరించునట. తత్కన్యాకరగ్రహణాము కొఱకు, ముసలివారే ఆంధ్రసాహిత్యపరిషత్తుఁగఁజేరి యల్లాడు చుండ, పడుచువా రూరకుండురాయని మిగిలిన సాహిత్య ములు వెఱ్ఱితలలెత్తిచూచుచున్నట్లు తోచుచున్నది. ఈకారు లలో సాహిత్యకారులలో మాసాటికారు అన్యులు కారనియే కాఁబోలు సాహిత్యశిరోమణులందరు పిలకలు పీకి పెద్దజుట్టులు పెంచి జడదారులై తపస్సుచేసి హనుమంతులవలె చిందులు ద్రొక్కుట. కన్యావలోకన మెంతభ్రాంతికితావలమగుచున్నది? తత్కరగ్రహణాశ యెన్నివికారముల పాల్సేయుచున్నది?

వీనినిఁ జూచి యుబ్బితబ్బిబగు దబ్బరకవులు గలరు. ఎబ్బెబ్బె యని సిబ్బితివడు నిబ్బరపు దెలివికాండ్రు గలరు.

కావున వీనిలోఁ గల విశేషమేమి? ఇందలి భావమా? యర్థమా? అక్షరముల యందమా? ధ్వనియా? ఇందేది తల కెక్కుచున్నది? ఎంతమందికి? ఎట్లు?

సంగీతమును గూర్చియు మనకు కొన్ని జవాబులు చెప్ప వలసిన ప్రశ్నలు వచ్చినవి. సాహిత్యమును గూర్చియు నట్టివే మఱికొన్ని ప్రశ్నలు గల్గినవి. రెంటియందు నేవేని సమాన ధర్మములున్నవా? రెండును నిట్లు ప్రజలనేల తార్మారుచేసి వికారముల పాలొనరించుచున్నవి? ఇందొకదానికి మఱొక దానికి గల సంబంధబాంధవ్యము లెట్టివి? దేనియం దేది యెంతవఱ కిమిడియున్నది? లేక యీద్వయము మఱేదే నొకదానినుండి యుద్భవించినవా? వీని పుట్టుపూర్వోత్తర ముల నిప్పుడు పరికింపవలయును.

ఒకఁ డొక పద్యమును రాగరహితముగనే చదువును. ఒకఁ డొక వాక్యమును చెప్పుచున్నాడు. శ్రోతలమనసున సంతోషమో, కోపమో, యనుకంపయో యేదేనొక భావము వొడముచున్నది. అనుకూలమో ప్రతికూలమో ఆవక్త నోటినుండి వెలువడిన పద్య, వాక్యానుసారముగ యథోచితభావము స్ఫురించుచున్నది. అదియటుండ, నొకఁ డొక కీర్తన పాడును. వినువారు ఆనందముననో, ఆశ్చర్యము

ననో విచారముననో మునిగిపోవుదురు. ఆకీర్తన మాని వట్టి స్వరముననే (అనగా సంగీతస్వరము, సరిగమలనే) అదియంత యుచర్వితచర్వణము గావించును. అప్పుడు వినువారిలో భావ మేముండును? ఆనందమో, ఆశ్చర్యమో తక్క మిగిలిన రసోదయముల కవకాశమెంత యున్నది? అదికాక సరిగమ లనుకూడ మాని వట్టి అకారోకారములనేఁ (తద్దరినోంలు తంతంలు లేకుండనే యని యూహ) పాడి విడుచును. ఆనం దమో ఆశ్చర్యమో కాక అప్పుడాలోచన కవకాశమేపాటి కలదు? పాటకుడు మూఁతి, ముక్కు, కన్ను, మొగము విఱుచుకొని ప్రేక్షకుల భయపెట్టిననే తక్క అన్యాలోచన మునకు తావెంతకలదు? తిఱిగి యారాగమే యొక కీర్తనతో మేళవించి పాడెననుకొందము. అప్పుడు వినికిలో గల భేద మేమి? ఆనందము తొలినుండియు గమనించుచునే యుంటిమి? ఇప్పుడు నదియుండును. పోనిండు రాగమువిడిచి ఆకీర్తనయే పఠించునుగాక. అప్పు డానందమో ఆశ్చర్యమో యొక రస భావ ముండకపోదు గదా. కీర్తనయే కాదు, అట సమావేశ మైన జనమునకందరకు ప్రియమగు శుభమగు నొక వర్తమాన మావర్త తెలుపును. అప్పుడు నానందమునకుఁ కొఱంత లేదు. ఐన నీయానందములలో భేదమేమి? ఈయానందమెట్లు కలిగినది?

వట్టిరాగమునే పాడినప్పుడు మాటలుకాని అక్షరములుకాని లేవుకదా. పద్యముకాని వాక్యముకాని ఐనచో అందక్షరములున్నవి. వాక్కులున్నవి. 'వాగర్థా' అని మహాకవి వాక్రుచ్చినట్లు దీనియందర్థస్ఫూర్తి వెంటనేవచ్చుచున్నది. కనుక యూహకు కారణమగుచున్నది. దానివలన రసోత్పత్తి. మొదటి దానియందిదమిత్థ మనురసస్ఫూర్తిలేదు. అట నున్నవిధ్వనులు. శబ్దములు (పదములుకావు) అనగా నాదములు. (అవేస్వరములు) అవికొన్ని కలసి యింపైన నానందమును, 'ఎంతయింపుగనున్నవి!' యనుకొనినపు డాశ్చర్యమును గలిగించును. అందలి రసస్ఫూర్తి తత్ధ్వనిరూపనిరూపణముననే యాధారపడియుండును. బెబ్బులియఱచిన ధ్వనికి వెఱపు. తుపాకిప్రేలిన నులికిపాటు, పైదూలమునుండి బల్లికాని తేలుకాని క్రిందవడి శబ్దించిన త్రొట్రుపాటు, ఇట్టిదొక స్ఫురణము. పాటకుఁడే యొక్కొక్కెడ కంఠమెత్తగనే పిల్లలులికిపడుటయు మన మెఱుఁగుదుము. పాపమా వెంగలి సంగీతమను భ్రాంతి తోడనే కేకవైచును. దాని కదరిపడు ప్రాణులు పెక్కులుండును. పాపమొక అరవపాటకుఁడు రాగమధ్యమున మధురముగనున్నయెడ నొక్కొక్క స్వరము వట్టునపుడు తద్రసాభాసముగ మనకు శోకకరుణము లుప్పతిల్లఁజేయును. ఇవన్నియు నాదముల వలన స్ఫురితములే. ఆనాదములే సాంకేతిక పద్ధతిని కలసినపుడు అక్షరానుగతి, పదానుగతి, వాక్యాను

గతిని భావస్ఫురణమునకు, అర్థస్ఫురణమునకు తద్ద్వారా రసస్ఫురణమునకు కారణములగుచున్నవి. అట్టి నాదస్వరూప నిర్ణయమే మనకిపుడు ప్రస్తుతాంశము.

శరీరపటము చూచినచో గొంతులో రెండు గొట్టములుండును. అందొకటి యూపిరిగొట్టము. అది ఇరువైపుల శ్వాసకోశములలోనికి పీల్చుగాలికిని విడుచుగాలికిని దారి. ఆయూపిరిగొట్టముపై నొక మూఁతయుండును. ఈలోపలి గాలియే ప్రాణవాయువు. మితభాషణమునుగూర్చి మన శాస్త్రవేత్తలు గావించిన గంభీరోపన్యాసము లీవాయువ్యయము కాకుండుటకే. ప్రాణాయామమున పూరకకుంభకరేచకముల యుద్దేశము నదియే. ఆమూఁతచేయుపనులు వివార సంవారములు. అప్పుడు లోనుండి వెలికివచ్చు గాలికి కొంత యొత్తిడియు నుండును. ఆవచ్చు గాలియొక్క మార్గనిరోధమునుఁబట్టియు పలుచఁదనము చిక్కదనమును బట్టియు ధ్వనులేర్పడును. ఇదియందరకుఁ దెలియునాదము. కాని హేమాహేమీలమని తమకుతామనుకొనుచు మనల గూడననునట్లు చేసిన యేపాశ్చాత్య దేశస్థునకు నే పాశ్చాత్య విద్యాగరిష్ఠునకు నేటికిని గోచరముకాక తలక్రిందైనను ఆవగింజలో నరువదవవంతు తెలియక, యొక్క పవిత్ర భారతభూమిని వసించిన వారిలో పెక్కుమంది కవలీలగఁ దెలిసిన నాదములు మఱి కొన్నియున్నవి. అవివతంజలి పేర్కొనినాడు. శ్రీణి నేంగయంతి

యని అందు మూడు వ్యక్తములు కావు. యోగాభ్యాసులకే సుగోచరములు. గర్భస్థములుగనున్నవి. పరాపశ్యంతీమధ్యమా యనునవి. నాలుగవది పైన పేర్కొనఁబడినది యందరకు శ్రవణగోచరమగునది వైఖరి.

ఇందు పెక్కు ధ్వనులున్నవి. పొట్టివి పొడుగువి. వలుచనివి. దళసరివి. ఇందును మూతి తెఱచుట నాల్కదగులుట దౌడలంటుట మొదలగునవి ఆగాలి వెలికివచ్చునపుడు జఱుగుచుండును. అపుడాగాలి ఆయా చోటుల సంఘర్షించి యొక నాదమును గలిగించును. అట్టి యుత్పత్తి స్థానములఁ బట్టియు భేదము లేర్పడినవి.

నేటి పదార్థ విజ్ఞానశాస్త్రజ్ఞుల (Scientists) కెట్టివస్తు జిజ్ఞాస కలదో అట్టిది మన పూర్వికుల కెంత యుండెనో యిట చెప్పఁబోవు నంశములవలననే ప్రద్యోతము కాఁగలదు. ఉత్పత్తి స్థానములఁ బట్టి భేదవిభేదములు కొన్ని పాశ్చాత్యభాషలలోను గలవు కాని యవియైనను ఆర్యభాషయగు సంస్కృత భాషా సదృశములగువానియుండే యున్నవి కాని దేశభాషలలో సున్న. ఇప్పుడిప్పుడు భాషావేత్తలు (linguists) తంటాలుపడి సమర్థించుటకు దేశభాషలలో గూడ సమాకరించుచున్నవారు. మనలోను వారిలోను సమానముగఁ గలవి కంఠ్యతాలవ్య మూర్ధన్య దంత్యోష్ఠ్యాదివిభాగములు. జర్మన్ (ఇండో జర్మన్) భాషలో, ముందు, వెనుక, నడిమి, యనికంఠ్య

ములలో కొంతది భేదము లున్నవి. ఆర్యావర్తమునఁ గల మహనీయుల, నేటి నాగరిక తాపటిష్ఠులు కాని,—నూటు బూటు కళ్లజోళ్లు చేతిగడియారములు ధరింపని, — వందలు వేలు జీతములు గొని పిట్టవీగని, — మిడిమిడి జ్ఞానముతో సంఘములమూల విచ్ఛేదమునకు యత్నింపని,—మునిముచ్చుల, పరిశోధనాతిశయమును పరికింపుఁడు. నాదమును మొదల ఉదాత్త, అనుదాత్త స్వరితములని విభజించిరి. ఇందు మాత్రలనిర్ణయమున ప్లుతములు పేర్కొనిరి. (ఇవన్నియు వైఖరీభేదములే యని గుర్తింపవలయును.) ఆపైన వివారసంవార, అల్పప్రాణ మహాప్రాణ, ఘోష అఘోష, నాదశ్వాస, జిహ్వామూలీయ ఉపధ్మానీయ — ఇట్లు వారికి వీలగునంతవరకు విభాగించి పేర్కొనిరి. అచ్చులు హల్లులనని (స్వరవ్యంజనములు) మఱొక భేదము. స్థానములఁ బట్టిన విభజన పైననే చెప్పఁబడినది. ఈ నాదమునే లెక్కలలోనికి దింపి లఘుగురుభేదము వెదకిరి. ఇవన్నియు భాషోత్పత్తిక్రమములు. కేవల నాదవిభజనలో మఱియు నొక విశేష మార్గ మవలంబించిరి. ఈనాద మనునది ఒక మనుష్యుని నోటనుండియే వచ్చునా యను శంకకు జవాబు మన ఋషులే చూపిరి. వారు ముముక్షువులై ముక్కు మూసికొని కూరుచుండినను స్వార్థపరులే కాక లోకకల్యాణము కొఱకు పాటుపడి రనుట కివియు నిదర్శనములే. వారు ధ్యానమున నుండఁగ ఓంకారమను ప్రణవనాదము వినవచ్చిన దనిరి.

అది కొన్ని ధ్వనుల కలయికయై యున్నది. అట్లు వారన్వేషించునపుడు మానవకృతధ్వనినే కాక చుట్టునుండు పశుపక్ష్యాది తిర్యగ్జంతువుల ధ్వనులు మఱి యితర జడపదార్థసంఘర్షణములవలనగలుగు ధ్వనులును పరికించిరి. అది వ్యాకర్తలకును, యోగశాస్త్రజ్ఞులకును తెలియఁగలదు. తప్పెటలధ్వని కాహళధ్వని, తూర్యధ్వని, హయగజకంఠధ్వని, పికకీరమయూరకంఠధ్వని, యివన్నియుఁ దులకించి వీని గతులనుఁ బరీక్షించిరి. అప్పుడు వారు సప్తధ్వనులు గుఱితించిరి. అవియే సరిగమాదులు. అవి ఆయా ధ్వనులకు సంకేతములు. రి, వృషభ మఱచు ధోరణి, గ, అజకంఠము, ఇట్లే హయహేష, గజఘీంకృతి; పంచమము కోకిల, నిషాదము కాకి, షడ్జమము నెమలి. అంతటితో వారికి సంతృప్తి కలుగలేదు. వృషభమునను మూడు తరగతులు (శుద్ధ, చతుశ్శ్రుతి, షట్ఛ్రుతి,) గాంధారమున మూడు (శుద్ధసాధారణ, అంతర్గాంధారములని) మధ్యమము (శుద్ధమధ్యమము ప్రతిమధ్యమములని) దైవతము (శుద్ధచతుష్షట్ఛ్రుతులని మూటిగను) నిషాదమును (కైశికి కాకలి యని) గుడ్లగూబ కాకి యఱువులుగను పరిగణించిరి. ఇట్లు నాదమును మంద్రతారవ్యవస్థలలో, సాంద్రతాభేదములఁ బట్టిపదునై దురీతులుగమనించిరి. ఇందుకొన్ని (మూడునాలుగు) నామాంతరములు, స్వరగతిని తులితములు కనుక పండ్రెండు పదమూడుగ నున్నవి. నాదోపాసన చేయువారివి తెలిసి క్రిందివి

పైవి యను స్థాయిభేదములుగ పాతిక (ఇరువదియైదు) రీతు లగు ధ్వనులను పలికించుటకు గళమును స్వాధీనము చేసికొన వలయును. సంగీతపరిశ్రమ యన మనవారి యభిప్రాయ మిది. పాశ్చాత్యులదో యపశ్రుతి హార్మోనియముకంటె నధ్వాన్న మగు పియానోపై, వారు పైకి లాగిన క్రిందికి, క్రిందికి లాగిన పైకి బోవు నస్వాధీన తనఖాదస్తావేజులవంటి కంఠములతో కేకలువైచి మిఱిసిపోవు సంగీతమున కృషియట్టిది. ఇందేది నాగరికత యను సమస్యయే యిపుడు దేశములను తబ్బిబ్బు చేయుచున్నది. మనము బానిసల మగుటచే, భావదాస్యము మన సొమ్మై యగుటచే పైచేయి వారిదే యని నా మనవి.

మఱియొకతూరి సాహిత్యరంగమునఁ బ్రవేశింపవల యును. రంగములు మారుచున్నఁగాని నాటకమున నందమే లేదనికదా అంకమునకు సంబంధమున్నను లేకున్నను,—బాగుం డదనియో, పంతులు చిన్నఁబుచ్చుకొనుననియో, లేక చిద్విలాసమునకో కాలేజీవిద్యార్థులు పరీక్షలయందు వ్యాస ములలో పుటకు పదిపదేనైన కొలిచి సద్దుబాటుచేసి యచ్చ టచ్చట అరసున్నలు శకటరేఫములు ఫర్లాంగురాళ్ళవలె తగిలించినట్లు, మన నవీన నాటకకర్తలును ఐదారైన రంగములు లంకించుచుండుట. కనుక రంగములు మార్చుట ముఖ్యము. సాహిత్యరంగమునకు పూర్వము మనకు కొన్ని పాత్రలు పరికరములు కావలయును. మొదటిపాత్ర

ఇంగ్లీషుభాషాధ్యాపకుఁడు. వానిచేతనొక బెత్తము ఇంగ్లీషక్షరముల పటము. ఇతఁడు చిన్నతరగతులలో మూఁతిముక్కుద్రిప్పుచు డాబు దర్పముచూపుచు 'వ్హాట్' (what) బోయి జ్స్ (boys) ప్లెయి (play) క్లెవ (clever) అని మాత్రమే అభినయించును. మఱలలోఁ బడి తిఱిగితిఱిగి భావదాస్యము పూర్ణమై ఘనీభవించిన బానిసియై బోధకశిక్షణాతరగతికి (బి. యిడి.) వచ్చుసరికి వానివలన మాయమర్మమెఱుఁగని మఱికొందరు పసివారు భ్రష్టులగునట్లు చేయఁగల తాహతు గలిగించి పంపుట కాపెద్దతరగతిలో పై ఆంగ్లేయ భాషాధ్యాపకుఁ డొకపటమును (Phonetic Script), చేత కట్టనుఁబట్టి, శర్వీలకుని దొంగతనములో నీతివెదకునట్లు, ఔరంగజేబు హత్యలలో పరమార్థమున కెదురుచూచునట్లు, లాటీదెబ్బలలో లా ఆర్డరులున్నవని సంతుష్టిపడినట్లు, యుద్ధములలో విదురశుక్రనీతిసారముల (Ethics of war) మించిన మహోపదేశ ముండుననునట్లు, పొందికపోలిక పుట్టుకలేని యక్కరములలో శాస్త్ర సౌలభ్యములు విజ్ఞానములు—నెత్తి, పొడియిసుకలోనుండి తైలముదీయునట్టు లసమర్థప్రయత్నములుచేసి నూఱిపోసి బోధించును. వానిపాటు, వినువారిపాటు, వట్టి గ్రహపాటేకాక భగవంతునిపొరపాటే. ఏ. బి. యఫ్. క్యు. వై. యక్స్. జడ్ ఈయక్షరములలో నొక్కొక్కదానికి గల పారస్పర్యమేమి? ఇంతకు మించిన నాగరకభాష అలీఫ్ బే

ఉబ్ అలీఫ్ బేజర్ బబ్—ఇవి యేకాక్షరముల నెఱుకపఱచు ధ్వనులట—పియుటి పుట్, బియుటి బట్, డబ్లియుఆర్ యివోకే (రీక్) ఇందు డబ్లియు వ్యర్థము. అదేమాదిరిది బిఆర్ యి యేకే (బ్రేక్) ఇట నేత్వము బియుఆర్వై (బెరీ) జేయు ఆర్వై (జూరీ), సైకాలజీలో ఐత్వము. 'పి' 'హెచ్' వ్యర్థములు. సిమ్మెట్రీలో ఇత్వము. ‹ఒయు, ఒకచో ‹ఊ, ఒకచో ‹అ,—యల్ ఆర్, అక్షరములు పెక్కు-చోట్ల నిరర్థకములే. ఇఁక ఫ్రెంచిభాష—వారివ్వాడు ప్రపంచమునందన్ని దేశములలోను నాగరకులు. నాగరికతవారి సొమ్మే. వారి భూమిలోనే దొఱకినగని. వారిలో అచ్చులకు అనగా ప్రాణాక్షరములకు తావుచాల తక్కువ. తద్వ్యతిరిక్తములగు హల్లులు ఉచ్చారణకు కూడ లొంగక 'రీసర్వేరాళ్ళ'వలె, నుండియు రైతు పరిగణింపనిమాదిరిని ఐదారొక చోటనే కట్టకట్టుకొనియుండును. వానిధ్వని మన భరత భూమికి దేవుడైన బ్రహ్మకు సాధ్యముకాదు. వారిబ్రహ్మకేమో—మనకు తెలియదు.

దేవభాషయని మనము గంతులు వేయుచున్న (అనలే గీర్వాణము) గీర్వాణభాష విషయమేమి? దాని ననుసరించి పుట్టిన తెలుఁగుమొదలగు వాని విషయమేమి? చూడుఁడు. 'ఓంనమఃశివాయ సిద్ధం నమః' యని బాలురకు హితైషులుగ మంత్రోపదేశము చేయుట యటుంచి, మొదలు ప్రాణాక్షర

ములు, (ఏవిలేనిదే కట్టెలవంటి శరీరములు నిలువవో, అవి) అట్లే వ్యంజనములకు పూర్వము చెప్పుట, అందు క్రమము, కుఱుచ, పొడవు, అ, ఆ ఇ, ఈ పిదప వీనిమాత్రలు ద్విగుణించుటకాక ఇంకను వృద్ధిచేసి, (ఎ) ఏ (ఒ) ఓలు పిదప ఐ ఔ లు ఆపై బిందువిసర్గలు పఠింపఁజేసి నిర్జీవాక్షరములగు క్, ఖ్, గ్, ఘ్, చ్, ఛ్ ఇట్టి వీని కా తొలిప్రాణమువోసి సాకారములుచేసి అందు వర్గనియతిని (ఉత్పత్తిస్థాన నియమము ననుసరించి) పైనున్న ప్రాణముల నన్నిటిని తిఱిగితిఱిగి యొక్కొక్క నిర్జీవాక్షరమునకుఁ బోసి వివిధాకృతులుగఁ జేసి ఆనందింపఁజేయు బోధనాపద్ధతి యిది. దీనికొక యుపమానము చెప్పిన బాగుగఁ దెలియును. అందముచందము లేక పడియున్న మట్టిని కుమ్మరి మొదట నునుపుచేయును. ఆపై కొన్ని చిన్నవిగను కొన్ని పెద్దవిగను అచ్చులుచేయును. ఆపై కొన్నిటికొకటి కొన్నిటికి రెండు గీతలు వెట్టును. కొన్నిటికి మట్లు పెట్టును. కొన్నిటికి మూతులు కొన్నిటికి కనువులు వెట్టును. కొన్నిటికి మూతలువెట్టును. ఇది నిర్మాణక్రమము. అట్లే శిల్పి. పునాదివేయఁగనే గోడలు కట్టును. పైన నిండ్లలో భేదములు చూపును. అట్లే చిత్రలేఖనము. అదే సృష్టికర్తచేయు పనియును. వస్తుసామగ్రి అచ్చులు హల్లులుచూపి అవసరమునుఁబట్టి కావలసినది కావలసినదాని కదికి అభీష్టకల్పనము కావించికొనుట. ఆపిదప నట్టివి మఱికొన్ని సంయో

గించి సంయుక్తాక్షరములు సృష్టించుట ఇందుచ్చారణభేదమున కెడములేదు. నాలుకగీచికొనక నాగరికులవలె పాచిని చెట్టికొని బండబారిన జిహ్వాలుగలవారి నోళ్లలోదక్క ఉచ్చారణక్లేశమేలేదు. ఎన్నివేలేండ్లకైనను ఎన్నికోట్ల ప్రజలకైనను ఒకే త్రోవ. వ్యక్తినిబట్టి గడియనుబట్టి మారదు. ఇది ఈ భూమియందు బోధనాపద్ధతి. శిక్షణాక్రమము. భాషలోగల వస్తుతత్త్వమిది. ఇందేది నాగరిలక్షణమో మఱియొక సమస్య—బాహాటముగ పైకి పరిష్కరించుటకు నోరురాక నత్తివాని గొణుగుడువలె అస్ఫుటమై యుండిపోయినది. నదురుబెదురు లేని నాజనాబేముందురా? ఏబదిరెండక్షరము లేమిటికిపీడ? ఇన్ని పఠించి జ్ఞప్తినుంచికొని బాధపడుటేల? క్రమమో అక్రమమో ఇందు కొన్ని నిష్క్రమించి పాతికో పరకో నాగరిక భాషలలో వలె స్వేచ్ఛగతోచిన ధ్వనులేరికొని భాషనిర్మించుటయే సుఖము. అప్పుడు కష్టమని తోచినచో బైసికిల్, సైకిల్, బైక్ అయినట్లు గవర్నమెంట్ గవ్ట్ అయినట్లు, పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టరు, సర్కిల్ అయినట్లు, శ్రీకాకుళము చికోల్, మచిలీపట్టణము, మసులా, విశాఖపట్టము, వైజాగ్ అయినట్లు జిగ్ జాగ్‌గా మార్చికోవచ్చును. ఒకవ్యక్తిని మఱొకవ్యక్తి నుండి వేర్పఱచి చెప్పుటకు (Entity and identity కొఱకు) తొలుతనే పెట్టిన పేరులు, వ్యక్తియు, వ్యక్తిలోని శక్తియు దేహ శక్తియుకూడ) నేయంశలో మాఱుచున్నవో (whether

Direct ratio or inverse) అది పరిశోధకుల (Research scholars) బాధ్యతకాని ఆ పేరులు హ్రస్వములై నరసింహము యన్. హామ్, గను, సీతారామయ్యరావులు, యస్. రామ్ (S. Ram) లుగను, మఱికొన్ని పేరులడుగంటి యింటి పేరులే మిగిలినవిగను, పెద్దవారి నోళ్లలో రావులుగోవులు గను, తార్మారులగునపుడు, ఇట్లు మనుష్యులు, వారి నామరూపములు కొఱతవడుచున్నప్పుడు నిక మీసములు పొట్టివగుట జాకెట్లు కోట్లు పొట్టివగుట యొకలెక్కా ? మఱి మనయిష్టము వచ్చినట్లు వినవలసిన మాటలు నక్షరములునా ? ఎట్లుకావసిన నట్లే మార్చికొనవచ్చును. పోనిండు.

ఇట్టి యక్షరములు కలసి మాటలుగను కొన్ని మాటలు వాక్యములుగను కలియుచున్నవి. అందొక్కొక్క యక్షరము మఱియొక యక్షరముతో కూడినపు డొక్కొక్క యర్థమును స్ఫురింపఁ జేయుచున్నది. ఇట్టి భేదోచ్చారణములు విభేద ధ్వనులు, తత్తద్భేదార్థములు నెఱుఁగుటయే సృష్టిలోగల ప్రాణికోటిలో, జంతుకోటిలో మానవునకుగల యాధిక్యము. ప్రతిజంతువును తన అభిప్రాయమును వెలిఁబుచ్చుట కొకరీతి ధ్వనిగావించును. లేక అభినయించును. తోక నాడించుట, అఱచుట, నాకుట, తలయెత్తుట. కూయుట, బుస్సుకొట్టుట యివియన్నియు నూహాలే కాని మాటలోపించుటచే చాల వఱకు దురవగాహములు. సామాన్యార్థములు ప్రేమకోపాతి

శయములే తెలియనగును కాని మాటలచే భావచేవలె, స్పష్టీక
రించుటకుగల యవకాశములు లేకున్నవి. ఆవేశమున నొక్కొ
కప్పుడు మాట మాటుపడి యభినయముననే వెలువడుటయు
గలదు. అది అసంపూర్తియే. భావవలనిప్రయోజనమో,
విపులముగ నెఱుఁగఁ గలుగుట.

ఈ మాటలాడుటలోనే పలువురు పలు తెఱఁగు లవలం
బింతురు. ఒకొొకఁడు వట్టి మాటాడును. ఒకొకడు మెడుకు
తనముగ పలుకును. ఒకొకడు యమకముతో మాటాడును.
మఱొకఁడు నియమముగ మాటాడును. ఒకడు సూటిగ
చెప్పును ఒకడు త్రిప్పిత్రిప్పి చెప్పును. ఒకడు చమత్కారముగ
పలుకును. ఒకడు మోటుతనముగ నుడువును. ఆభావమునే
మఱొకడు విసిఁగింపక హృదయాహ్లాదకరముగ తెలుపును.
ఒకడు క్లుప్తముగ నొడువును. ఇంకొకడు శ్లేషించును. ఇవ
న్నియు నాయావ్యక్తుల మనస్సులనుఁ బట్టియు వారి కళను
బట్టియు వారి వారి సమర్థతలఁబట్టియు నుండును. ఇవియే
శైలీభేదము లగుచున్నవి. ఇవియే గౌడీవైదర్భీరీతులు. ఇవియే
కైశిక్యారభట్యాదులు. ఇవి యేవక్రోక్తి మొదలైన యలం
కారోత్పత్తి క్రమములు. వీని నెఱుంగుటకు పఠించునవే సాహిత్య
గ్రంథములు. ఇదియే భాషాభివృద్ధి లక్షణము.

మఱియొక విశేషము ఈధోరణులలోనే ఒక్కొక్కరి
మాటలనడక యొక్కొక్కరీతి. అవియే వివిధగమకములు,

యమకములు. అట్టిమాటలే మఱికొన్ని నియమములకు కొలఁతలకు లోనై యుండును. అవియే చంధోరూపములగు చున్నవి. అట్టి నియమితచ్ఛందముల, పరిమిత వాక్యముదా యముల పఠించు క్రమమునకే లయ యని వ్యవహరించిరి. ఈలయ యనునది క్షణికత్వమును మాత్రను సూచించునది (It is a unit in one sense) వ్యాకర్తలు నాదస్వరూ నిర్ణయమున స్ఫోటవాదము మున్నగువానిఁ జర్చించిరి. అట తేలిన సారాంశము నాదము క్షణికమనియే. ఒకనాదము వెలువడి అది వెంటనే లీనమైపోవును. అది నశించును. దాని స్మృతి మాత్రమే నిలుచును. తరువాత వచ్చునాదములతో అనగా వాని స్మృతులతో ఒకదానితో నొకటి కలసినపుడు ఆస్మృతుల్లవలన గలుగు భావనయే అర్థము. స్మృతియే అర్థము. ఇది చాల దీర్ఘవాదము దీనినుండి తర్కమునఁ బడ వలసిన యవసరముంటుటచే దీని నింతలో ముగించుట మంచిది.

'లయ' అనగా నశించుట. అది ఒక అక్షరముగా, రెండుగా, నాలుగుగా లయింపఁజేయుట యొక పద్ధతి. ఒక ఛందస్సు యెనిమిది అక్షరముల పొడవు. అంతవఱకు దానిని నడపి అంతితో దానిని లయింపఁజేసి తిఱిగి పునరావృత్తిగ మఱెనిమి దక్షరములు కై కొందుము. ఒకెడ పందొమ్మిది. మఱొకచో ఇరువది. వీనికే వైయాకరణులు సాహిత్యకారులు ఛందములనియు వృత్తములనియు (చంపకము, ఉత్పలము,

అనుష్టుప్, గాయత్రీ, త్రిష్టుప్ మున్నగునవి) పేరు లిడిరి. ఈ మాత్రల పరిమితినే సంగీతమున తాళములని లయ యని వ్యవహరించిరి. ఈ సంగీతము వేదముననే యున్నది కాని క్రొత్తది కాదు. సామవేదమును అందలి చంధస్సులను పాడుట కుద్యమించిరి. ఋక్కులకు పఠనమున ప్రత్యేకగతి యున్నది. ఆ గతులు క్రమమున వృద్ధినొందినవి. వీని కన్నిటికి శ్రుతి ప్రధానము. ఒకడు మాటాడునపుడు వాని కంఠమునఁ గల మాధుర్యమునుఁ బట్టి జనుల నాకర్షింపఁగలుగును. అది శారీరమని గాయకులు చెప్పుదురు. అదే గాత్రము. కనుకనే సంగీతము కొంతవఱకు సహజమనుట. సంగీతమునకు శ్రుతి మాతయని, లయ పితయనియు వాడుదురు. శ్రుతి యనగా వినికి యనియు వేదమనియు నర్థములు. వేదమే తొలుత దీని పోషించినది. కేవలనాదస్వరూప మగుట వినికియే దీనిని పోషించునది. ఆ వినికిలో శిక్షితమగు రీతి నుండుటకు చెవికి గూడ శిక్షణము నొసఁగవలయును. అది సరిచేయుటకే గాయకుఁడు ప్రక్కను మఱొక యంత్రమును శ్రుతిగా నిలుపుకొనును. కంఠము నటు నిటు తొలఁగనీక యా శ్రుతి అదుపునానల నడపుచుండును. అట్టి లయశ్రుతులతో ఒక కొన్నిరీతుల నాదముల మేళగించిన నొక ఫక్కిగను మఱికొన్ని రీతుల నాదములు మేళవించిన మఱొక ఫక్కిగను శ్రోతల కింపు గావించుచుండును. ఇవియే రాగభేదములు గమకభేదములు.

కేవల స్వరరూపమగు నకారేకారోకారముల కంతగ నర్థములేదని ముందే మనవి చేసితిని. కనుక నాదస్వరూపమగు లయశ్రుతిపూర్వకమగు గానమునకు అర్థములేదు. అది కేవల శ్రవణేంద్రియప్రీతి గలిగించి ఆరీతి హృదయంగమమగుటయే దానినైజము. కనుకనే గాయకుఁడు కంఠముతో పాడుట కవకాశము లేనప్పుడు యంత్రములతోఁగూడ ఆయా ధ్వనులు వెలువరించును. అపుడా తీగలపైనుండి వచ్చు నాదము కేవల స్వరరూపమేకాని భాషలోగల అక్షరములు గావుకదా. వసుచరిత్రయంతయు వీణపై వాయింపవచ్చునని యొక సుప్రసిద్ధపండితుఁ డనెనట. ఎట్టి భ్రాంతి! అటులైన మనుచరిత్ర ఏలకాదు? వేమనపద్యము లేలకావు? గోంగూర్పాట చల్ మోహానరంగ యేలకావు? సంగీతములో గల కళావిశేషమునుఁ బట్టియే అందలి ఇంపుసొంపుల తారతమ్యము లేర్పడును. కేవల పాండిత్యప్రకర్షకుదిగి సాము చేసి ముచ్చెమటలుఁ బట్టి బాధపడి స్వరములు (సరిగమలతో శ్రోతల నేడిపించుగాయకులను గని యేముదుసలివారో లేక పెద్దమనుష్యులో జాలిపడవలసినదే కాని మిగిలినవారందరు తిట్టువారే అయినచో సంగీతమా? అవగీతమా? దుర్గీతమా? కాని అమాయికులగు చాలమంది పాడువాఁరునోటనెన్ని సరిగమలు గ్రుక్కలో ననగలిగిననంత సంగీతమని భ్రమించుటనే నెఱుగుదును. అవి చిలుకలవలె వల్లించినవో, లేక పాఠము

లోనివో మఱి తప్పో యొప్పో తెలియక నిశ్చేష్టులై వెఱ్ఱిగ తలలూపుచుందువారే సగముమంది సభ్యులు. గాయకునిబుద్ధి ఆతఁడేరుకొను స్వరములలో పోవునడకలలో నుండును. అది అనుభవమున కొంతవఱకు లభించునుగాని పూర్వసుకృతము వనే సంపూర్ణముగ ప్రాప్తించును.

అట్లే కవిత్వము, సాహిత్యము. చదువుకొనువారికి చాలమందికి భాషలో చాలమాటలు కంఠస్థములే కాని యొకొక్కరొక్కభావమునే వేఱు వేఱు మాదిరులుగ వ్యక్త పఱతురు. ఒకరి కవిత్వము సున్నితము. ఒకరిది పెళుసు. ఒకరిది చమత్కారము. అది వారువారు, ఆభావమును వెల్లడించుట కుపయోగించు పరికరములలో నున్నది. ఆమాటలలో, ఆపోకడలలో, ఆపొందికలలో ఆరసపుష్టి యిమిడియున్నది. ఒకేరాగమును పెక్కునోళ్ల వింటుము. ఒకరిది ఏడ్చినట్లుండును. మఱొకరి ధోరణి ముద్దువచ్చును. ఒకరు పరవశులనుఁ జేయుదురు. ఒకరి మొగము చూడగనే ఆనందము పారవశ్యము, ముద్దు, ముచ్చట, ప్రేమ ముప్పిరిగొనును. ఒకరి మొగమున మొద్దులుపెట్ట బుద్ధిపుట్టును. అందుకు వారెట్టి బాధ్యులు? అవి వారివారి పూర్వపుణ్యఫలితములు.

ఈసందర్భముననే మఱొక మనవి. వారివారి పూర్వపుణ్యము లెట్లున్నను, ఎవరిమట్టుకువారే చాలా సొగసుగా నుండవలెనని యత్నించువారు, ఫేస్‌పౌడరులు వ్రాసికొను

వారు, నిత్యక్షౌరములు చేసికొనువారు, అద్దము చూచికొని అదేపనిగ ముఱిసికొనిపోవువారు నయ్యును పరహృదయ రంజన మెందరికి సాధ్యమగుచున్నది? ఎంతయో చమత్కారముగ ప్రసంగింపఁబోయి బోర్లపడువా రెందరు? చూడుడు! భోజనపంక్తులలో పాటగాండ్రను ప్రక్కవారు బ్రతిమాలుచుండ పంతముబూని బాధించుటకో యనునట్లు పండ్లూడిన బావన్నగారు పాతికముప్పది పద్యములుపాటలు పీడించి పాడుట యేటికి? ఎంతో యింపుగనుండితీరుననియే పాపము వాని యవస్థ అట్లే గానసభలో 'సరిగమల సందడి,' చావంతపనిగ మూతివిఱుపు, ముక్కు విఱుపు. అటునిటు దేకుచు దేవులాడుట. అంత యెందులకు పత్రికలలో తమాషాలని, నవ్వులని, హాస్యములని వ్రాసి యాతనపడుట ఏల చమత్కరించుచుంటిమను మాద్యమే కదా. నవ్వులేనందు కేడుపని చదువరులంద రెఱుఁగుదురు! ఆకథల యాగడమేల? అందరు వారిపేరే స్మరించి వారినే చదువుచున్నారనుకొను వెట్టియే కాకున్న నిందరు కవులేల? ఇట్టి వెట్టిని గల్పించి, ఇట్టి యాతనల పాలునేసి, యిట్టులాడించుట కీ కవిత్వమున నీసంగీతమున నీ రెంటియందు నేదే నొక యాకృష్టముండవలయును. లేనిచో పాపము తెలుగుపాఠమును చెప్పు పంతులు పిల్లలు నవ్వుచున్నారనియో నవ్వుదురనియో బిడియమైన లేక యొక పిచ్చిరాగ మేలతీయును? అనగనగ రాగమతిశ

యిల్లునవిచూ? ఈపంచరత్నకవులు, నవరత్నకవులు, సమయ కవులు, ఎలెక్షను (ఎన్నికల) కవులు, అభినందనకవులు, ఉక్కిరిబిక్కిరి కవులు, గోలకవులు, తందనాల కవులు నింద కేల? అభ్యాసం కూసువిద్యయని పెద్దలందురు కనుకనా? వ్రాయగ వ్రాయగ వారే వ్రాతకారులు కావచ్చునని కాంబోలు. అది పెట్టిపుట్టినవారికే అట్టిది సాధ్యము అట్టివారి కది అభ్యాసము కావచ్చును. లేనివారి కది అడవిపదడు. వస్తువే లేనిదే మెఱుఁగు దేనికి?

సరి. పైన నీరెంటియందు దేదేనోత్కృష్ట్య ముండవలె ననుకొంటిమి. అది తరువాత పరిశలింపవచ్చును. ఉత్కృష్టత గలిగిన యీ సంగీతసాహిత్యములస్థితి యెట్లున్నది? చూడఁ దగిన విషయము సంగీతము పుట్టినప్పటి విషయము కాదు కాని ఈ మధ్యనది భాగవతుల వశమునను, 'కళావంతుల' మను వేశ్యల యిండ్లనుఁబడిపోయినది. వేశ్యలనోళ్లఁబడిన కతమున వారెంత వలుకు సరసుడ అని జాలమేలర లేచిరారాయని విరహములు మోవులు చూపవలసినవారే యగుట వర్ణములన్నియు నిట్లు నుళువైనవియు రసికులనుగ్రామ్యవిటుల నాకర్షింపవలసినవియు నగు నిట్టి పదములతో వెల్లివిరిసినవి. ఇవి సంగీతవిద్యకు పునాదులవంటి వగుటచే గృహస్థులు సంసారులు నిట్టి సంగీత మును తమపిల్లలకు నేర్పింపవెఱచిరి. కొలదికాలముక్రిందట హార్మోనియమున్న యిల్లు 'బోగముకొంప' యనునంతటి

వారు, నిత్యక్షౌరములు చేసికొనువారు, అద్దము చూచికొని అదేపనిగ ముఱిసికొనిపోవువారు నయ్యెను పరహృదయ రంజన మెందరికి సాధ్యమగుచున్నది? ఎంతయో చమత్కారముగ ప్రసంగింపఁబోయి బోర్లపడువా రెందరు? చూడుడు! భోజనపంక్తులలో పాటగాండ్రను ప్రక్కవారు బ్రతిమాలుచుండ పంతముబూని బాధించుటకో యనునట్లు పండ్లూడిన బావన్నగారు ముప్పది పద్యములు పాటలు పీడించి పాడుట యేటికి? ఎంతో యింపుగనుండితీరునని యే పాపము వాని యవస్థ అట్లే గానసభలో 'సరిగమల సందడి,' చావంతపనిగ మాటిమాటికి విఱువు, ముక్కు విఱువు. అటునిటు దేకుచు దేవులాడుట. అంత యెందులకు పత్రికలలో తమాషాలని, నవ్వులని, హాస్యమ్ములని వ్రాసి యాతనపడుట ఏల చమత్కరించుచుంటిమను మాధ్యమే కదా. నవ్వులేనందు కేడుపని చదువరులంద రెఱుఁగుదురు! ఆకథల యాగడమేల? అందరు వారిపేరే స్మరించి వారినే చదువుచున్నారనుకొను వెఱ్ఱియే కాకున్న నిందరు కవులేల? ఇట్టి వెఱ్ఱిని గల్పించి, ఇట్టి యాతనల పాలుసేసి, యిట్టులాడించుట కీ కవిత్వమున నీసంగీతమున నీ రెంటియందు నేదే నొక యాకృష్ట్యముండవలయును. లేనిచో పాపము తెలుగుపాఠమును చెప్పు పంతులు పిల్లలు నవ్వుచున్నారనియో నవ్వుదురనియో బిడియమైన లేక యొక పిచ్చిరాగ మేలతీయును?· అనగననగ రాగమతిశ

హేయస్థితియుఁ గల్గెను. ఆ వేశ్యలే గానకళ పోషింప
వారగుటను ఐనయిండ్లవారు దానిని వర్జించుటచేతను
భాగవతులవంటివారును ఈకళ నభ్యసించిరి. అపస్వర
మెండైనవి. ఉచ్చారణ చచ్చినది. అర్థము లడుగం
తెలుఁగు బరులురాని అరవఅన్నయ్యలు ఆకళకు, ఆ
కృతులు పాడుటకు అధికారులైరి. పాడువారికే
తెలియనప్పుడు వినువారికది అయోమయమే. సిసిరో
న్యాసమంతయు విని సారంశమేమని యడుగగా 'అద
వట్టి గ్రీకు' అని చెప్పిన కేస్కావలెనే పాడినదేమో
యక అయ్యరుగారి అభినయము సాము చూచి వచ్చి
గొడవ కాబోలునని సరిపుచ్చుకొనవలసిన స్థితిలోని
తము వచ్చినది. ఇది కనిపెట్టి బలాత్కారసంగీత మభ్యా
మఱియొక అయ్యరు, పెట్టిపుట్టని కసరతు గాయకుఁడగు
సాతాని, యిట్లు ధనార్జనకు రకరకములుగ తలలెత్తిరి.
నోం తోం తాం దద్దదన్న మొదలైనవి మంత్రగతశ
రములవలె, సంగీతమున కుఱిసిపోయినవి. తొలిపా
యుద్దేశము సంగీతము ఆనందము కలిగించుట కేర
కనుక ఆ — నం — — దాఽఽ — నం — ద
నం అని పాడినో లేక దీనిగుణము ఆనందము, ఈశ్వ
అనంతమనియో లేక ఆదిశేషునకు ప్రీతియగుటనో
విష్ణు స్వభావము గలుగుటనో లేదా స్వరము లయవ

మరలమరల పుట్టుట లయమగుట ఇట్లెడ తెగనిదనియో నాద
మునుగూర్చి 'అనంత' అని అదే అ——నం——తా౽——నం——
తా౽——సం——త అనియే పాడెనో అది యిప్పుడీ అభాగ్య
స్థితికి 'దద్దరినోం' లోనికి దిగినది. ఈస్థితిలో కొందరు 'సరసుఁడా
జాలమేల' మొదలగు సాహిత్యములను తగ్గించి వట్టి అకారసాధ
కముననే పాడుటకు మఱొక సాహిత్యము నమర్చుటకు తహ
తహగలవారైరి. ఒకే రాగము నెన్ని పద్యములనైన నుపయో
గింపవచ్చును కదా. దానికి మంచి తార్కాణము శుభమని
పెండ్లిచేసికొని విందులు సేయుచుండగ పెండ్లిపందిరిలో ఒక 5 వ
ఫారము చదువుచున్న ఒక గాలిపాటకుని పదిమంది రెచ్చ
గొట్టి పాడింతురు. అతఁడు అనుకరణము అసమర్థుల ప్రథమ
లక్షణ మగుటచే ప్రసిద్ధనటకుని 'ధోరణిని, "కాఁబోలు బ్రహ్మ
రక్షస్సమూహా'మని ఎత్తికొని, కాఁబోలు వీరు విగతజీవబాంధ
వులు అడలుచుండిరి మహార్తారవముల" యని పందిరి నెగుర
గొట్టి పాట విసురును. ఒక పుణ్యాత్ముఁడైన ఏమబ్బాయీ.
ఇంత తెలివిగలవాఁడవా? యని యడుగఁడు. అడుగుటకు
ముందు వినువారి కది సుబోధమైనఁగదా. పోనీ, ఏలక్ష్మీ
కళత్రమో, ఏఅంగనామంగనా మంతరమో లక్ష్మీకాంతం
కమలనయనమో, తెలియకపోయినయెడల ముఖారిమీద
నైనను పాడఁగూడదు.? గయుని వేషధారి సంగీతము
ధోరణిలో పాతాళమున కేగి యని పాడుచు తనచేయి.

నాకసమున, కెత్తును. ఎత్తిఎత్తి నొప్పిపెట్టి, నక్షత్రపథమున నణఁగి యనుచు ఆచేతిని క్రిందికి దింపును. ప్రేక్షకకోటి యీ సంగీతమును చిలకమర్తివారి కవిత్వమును నెగాదిగ చూచు వారై తన్మయులగుటయు నేమూలనుండియో రసాస్వాదన తత్పరుఁ డొకఁడు 'వన్సుమా' రనుటయు నడగుట తడవుగ నుపాంగి అభినయించుచు నటకుఁడు పాడుటయు వారి ఆనందమును పేర్కొనఁ దగినవి. "కల్వారేకులవోలే కన్నూల వాఁడో, సల్లానూవులు యేధఁజల్లూ వాఁడోయి" అని పాడుకొని యానందించు దూడలకాపరి కది యర్థము కాదుకదా. అందలి నాదము ఆ రాగము మనసు దూరి సంతోషపెట్టుట చేతనే. అట్లు కాకేని మన మెఱుఁగని పార్సీ, హిందూస్థాని పాటలకు మనము, మొదలే తెలియని తెలుఁగుపాటలకు అరవలు, నేల చెవియొగ్గవలయును? మాటలే రాని, శిశువు జోలపాట కేల ఆనందించి ఏడుపుమానును? పశువేల అత్తెత్తి యాలకించును? పామేల పడగవిప్పి యాడును? అందలి అర్థమా? నాదమా? పరభాషవద్దు. మనకు వచ్చిన భాషలో అపశబ్దములు మన మేల సైరించుచున్నాము? వానిని మన మేల సఱకుగొనము?

1. 'అవివేకమానవుల కోరికోరి' అనుచో విరుద్ధార్థముగ అవివేకమా! నవుల (నవ్వుల) కోరికోరి—అని పాడినను అందలి లోపము మన చెవికే యెక్కదు?

2. ఎటులఁ బ్రోతువో తెలియదు—ఏకాంత రామయ్యా—అనునది ఏటులాప్రోతూవో తెలియ (ఁ—) దేకాంతరామయ్యా అనుటలో దేకుటయో దూదేకుటయో మనకు వెగటుగతోపదు.

3. జగమేలే పరమాత్మా ఎవరితో మొఱలిడుదు—దీని అర్థము మనకు తెలియును. కాని నే

జగమేలే పరమాత్మా ఎవరితో | మొఱలిడదు—అని పాడి భగవంతుని చెంపఁగొట్టినట్టు చెప్పినను మన కిష్టమే. లోపము చెవి దూఱదుగా?

ఇంతకు దీని విశేషమేమి ? అర్థ మడుగంటినను నాద మున్నఁ జాలును. మాటలు వినిన 'ఛీ ఛీ' 'బూతు'లను న వే యంత్రముపై నాదస్వరూపమున వినినచో తలయూఁపుదుము. అట్టిమహత్తు నాదమున నుండుటచేతనే అర్థముండినను నాలుఁగు భుగ్నహృదయాల జీవితపథాల, మృదుమరాళవిభ్రమణాయనుస్నిగ్ధ గానక్రమకాంతి వినిశీధమధుర ముగ్ధమోహన వేణుప్రశాంతముల భావగీతముల భావకవిత్వముల ఆడవే గోపికా పాడవే రాధికా అని మనముగూడ నొడలు మఱచి 'సుఱిగి'పోయి శ్లాఘించుట. అదికాదు, చెప్పుచున్నదానిలో అర్థమే యున్నదో అనర్థమే యున్నదో తెలియకపోయినను చప్పుడు చేయుచు బల్లగొట్టుచు అఱచినప్లీడరు బాగుగ వాదించుచున్నాఁడని పార్టీలనుకొనుట యానాదముధోరణినిఁ బట్టియే

కాదా ? ఇట్టి దగాకోరీనాదమే. ఇట్టి మాయలాడి యీ నాదమే. ఈ మైకమీనాదమే. ఏనాదమును నిజముగ గుర్తె ఱిగి క్షణభంగురానందముగాక తలచినకొలఁదిని అరసినకొలఁదిని తన్మయత్వము గలిగించి చిదానందసదానందముల గలిగింపఁజాలుదురో, అట్టి నాదోపాసనయే యేకొందరినో మహానుభావులుగఁ జేయుచున్నది. వారే నాదబ్రహ్మలు వారే గాయకులు, వారే కవులు, కవిబ్రహ్మలు. అంతియు కాని బిరుదమాత్రులుగారు.

అట్టిదగుటనే షేక్స్పియర్ సంగీతమున కరగనివారిని ఆత తాయిత్రాగుబోతు జూదరులకంటె నికృష్టజాతిగ పరిగణించుట. మిల్టన్‌కవి గాన దేవతనర్థించుట. మన కవులందరు చేయుం పనియే యది. మనోరోగములకు మందులు లేవఁట, కాని సంగీతమునఁ గొన్ని కుదురవచ్చునని యిటీవలి పరిశోధకులు గుర్తించుచున్నారు. అపరాధపరిశోధనలలో నేరగాండ్రను పట్టుకొనుటకు సంగీతమును కూడ ఒకసాధనముగ చేయు చున్నట్లు గ్రంథములే యున్నవి. ఏమికాకున్నచో, 'రహిపుట్ట జంత్రగాత్రముల రాల్గరగించు' అని వరూధిని రొమ్ముమీద చేయియుంచి కొని చెప్పగలుగును ?

రక్తి కలిగించుటకు పాటలుండఁగా విరక్తిగలిగించు టకును పాటలున్నవి. రాగము కలిగించుటకు వేశ్య యాడగా పాడగా విరాగము గలిగించుటకు 'బ్రహ్మ'మని 'గురుడా'యని

తత్త్వములున్నవి. భక్తి గలిగించుటకు పద్యములుండఁగా, విభక్తులుగాఁ జేయుటకు పదములు వెలిసినవి. మాటలలో చెప్పుటకంటె పాటలలో చెప్పిన చప్పున మనసున కెక్కుటయే యందలి మర్మము. గద్యముకన్న పద్యము బాలురకు వదిలపడును. పండితపామరుల నందర రంజింపఁజేయునదీ నాదము. సులభముగ హృదయము నాకర్షింపఁగలది యీసంగీతము. పండితులకే యానందమీఁగలది యీనాదమేకాని యందలి విశేషము మాత్రమే (అనగా అందలి అరము). కనుకనే సంగీమును ముందు పేర్కొని సాహిత్యమును తరువాత చెప్పెద సంగీతమపి సాహిత్యమనిరి. ఇవిరెండును నాదమునుండియే జనించినవికదా, యివి రెండును సరస్వతీ స్తనద్వయమనిరి. అందు సంగీతము ఆపాతమధురమనిరి రెండవది ఆలోచనామృతము. ఆలోచించి అర్థమరయువలయు నప్పుడే అందలి అమృతము ఆస్వాదనీయము.

మఱియొక అంతరమీ రెంటికి నున్నది. నాదము క్షణికమని ముందే యెఱిఁగియుంటిమి. కావుననే ఒక పాటకుఁడు పాడినతరువాత వాని పాటనుగూర్చి ముచ్చటించునపుడు, "ఏమిపాట! చాల బాగున్నది! అమృతము కుఱిసిపోయిన" దను వారేకాని మఱునాఁడు, మఱునాఁడేకాదు, ఆమరునటి నిముసమున దాని స్వరూపమునుగూర్చి చెప్పలేరు. దాని

చూపలేరు. ఇదమిత్థమనునది దానికిలేదు. నిర్వికారము. (మన పాటకులచెంతమట్టుకది సవికారమే.)

సాహిత్యమునకును మాటలుగానే నిల్చియున్నచోనట్టి గతియే. దానికి లిపికూడ నేర్పఱచి దానిని వ్రాసియుండుటచే మాటలునిలిచి వానికర్థములు మిగిలినవి. అర్థసహితములై రూపసహితములై యుండుటచేతనే యిది సాహిత్యమైనది. నేటిమాటలు తిరిగి తేపుకూడ తెలియఁబడఁగలవు. నిర్వికార నాదమేకాక సాకారమగు నాదమగుచున్నది. కనుక ఇదిస్థిరము. వేయి యేండ్లక్రింద పలికిన నన్నయ ధోరణి తిక్కన భావన, శ్రీనాథుని పదజాలము, పోతన చిత్రలేఖనము, కాళిదాసుని కవనము, వాల్మీకి వ్యాసుల రచన, వేదముల ఘోష నేటికిని మన చెవుల నందడించుచున్నవి. మనమ్రోల తాండవించు చున్నవి. ఇటీవలి వాఁడగు త్యాగరాజు పాడినరీతి అదృశ్యము, అనూహ్యము నైనది.

ఈ చెంతనే సన్నిహితత్వము నొందగలిగినది చిత్రలేఖనము. సంగీతమువలె పండితపామరరంజకమగునది. శ్రుతిమాత్రమున సంగీతమెట్లో దృష్టిమాత్రమున చిత్రలేఖనమట్లు. సాహిత్యమువలె దీనికి భావన తప్పనిసరి. "సాహిత్యకారుడూహించి మాటలతో మూర్తుల గోచరింపజేయును. చిత్రకారుఁడట్లే భావించి కాగితముపై వన్నెచిన్నెలతో ఆకారము నిర్ణయించును. ఒకరికొకరు సహకారులు. ఒకరి 'సశేషము'

లింకొకరు పూరింతురు. ఇరువురును గలసిన భావనకు సంభావనకలదు. రవివర్మవలన పురాణప్రబంధపురుషులు అందరకు దృగ్గోచరులు గాఁగలిగిరి. వానిపటములు పెక్కురు కవుల వర్ణనాప్రచురములును గాఁగలిగినవి.

గాయకునకు కంఠము పనిముట్టు కవికి శిల్పికి కలము పనిముట్టు, పాటకుఁడస్థిరుఁడు. వాని ధార యచిరము, కవి శిల్పులు సుస్థిరులు. వారి ధార సుచిరము, సురుచిరము, వీరి లిపియు లేఖినియు వీరిని శాశ్వతులఁ జేయుచున్నవి. గాయకుని కృషివినికి యగుటచే అనుకరణముల అనుసరణము గలది. కవిశిల్పులది కేవలమూహానుభవప్రపంచము. "ఉద్ధరే దాత్మనాత్మాన" మనునట్లు పాటకుఁడు తానుండియే రజింపఁ జేయవలెను. కవి శిల్పులకా బాధలేదు. పాటకుఁడా తానుగనే మెప్పింపవలెను. కొంతవఱకు చిత్రస్రష్టయు నట్లే. కవులు తమంత తాముకంటె నన్యుల నపేక్షింతురు.

పాడుమని బలవంతపెట్టినను పాడక తన పిచ్చికొఱకెప్పుడో పాడుకొనునది సంగీతము. అన్యులకొఱకు కాదు తనపిచ్చికొఱకే. ఇప్పటి కవులు కొందరు తమ పిచ్చికొఱకే యందురు కాని అన్యులు మెచ్చుకున్నను, ఆదరింపకున్నను వారును చిన్నబుచ్చుకొనువారే. ఈతఁడు కోరునది పాటకుని వలె, ఆత్మానందమే కాక, సర్వజనామోదము, సర్వకాలామోదము. కాని "ఊరకకృతుల్ రచియింపశక్యమే" యను

టయు నిజమే. 'నిరుపహతిస్థలము రమణీప్రియదూతిక విడెములు' తదభివృద్ధికి తోడుపడునవే.

అవిస్మరణీయాంశము మఱొకటి. గాయక-చిత్ర కారుల కలభ్యయోగమగునది కవికి నైజము నగునది క్రాంతదర్శిత్వము. "నానృషిః కవిః" యను దానికిదియే తాత్పర్యము. గాయకుని తత్త్వము శుశ్రూష, శిల్పిది దిదృక్షు, కవిది వివక్షు, కవిశిల్పు లిరువురగుణము కళాసిసృక్షు. అందు కవిసృష్టి,

"రమ్యాణి వీక్ష్య మధురాన్ శ్చ నిశమ్య శబ్దాన్
భావాంతరాణి జననాంతరసౌహృదాని".

ఇట్టి సున్నితములు లలితములునగు కళల సంయోగమొకచో సిద్ధించిననాఁడు,

"వస్త్వేకైక మపీహ వాంఛిత ఫలప్రాప్తేః పదంకింపునః మద్భాగ్యోపచయాదయం సముదితః సర్వోగుణానాం గణః."

"నాటకాంతే సాహిత్య"మను వారిభావము తూచినట్లు చెప్పుట కిప్పటికి సందుదొఱకినది. అవకాశమేర్పడినది. ఆనందమను నాటకమున, గాయకుఁ డుపనాయకుఁడు. వీనిచుఱుకుదనము నాందిప్రస్తావనల లోనే విదితమగును. చిత్రకారుఁడు అంకాస్యాంకావతరణముల యందు (విష్కంభములయందు స్వగతములను ఆకాశభాషితములను క్వాచిత్కముగ) ప్రధానపాత్రయే. కవి కథానాయకుఁడు. బీజబిందుపతాక ప్రకరీకార్యములయందు గర్భవిమర్శనిర్వహణములయందు నుద్దీపితుఁడుగ

చరించి భరతవాక్యమును చెప్పించువాఁడు. ఆనందమే ప్రకృతి, తత్ప్రాణిగ్రహణోద్యమమే నాటకకథావస్తు వను కొనుఁడు. ఇందలి ధ్వని యానందవర్ధనము. ఇందలి యలంకారవృత్తులు వామనులే కాదు ధీమణులందరు కొని యాడునవి. ఇందలి యౌచిత్యవిచారచర్చ క్షేమేంద్రునిదే కాదు రసికులు సుధీంద్రులునగు వారిదందరిది. ఇదియే జగన్నాటకము.

ఇటువంటి కవులు ప్రజలకందరికి నందుబాటు కారు కదా. వారి మాటలుగూడ అందరి తలల కెక్కవలెనన్న దుర్ఘటమే. అటుకాక బైరాగులు తంబురావట్టిపాడు వేదాంతోపదేశములు పామరులకును ప్రయోజనకారులగుచున్నవి. అట్లే త్యాగయ్యగారి, ఎవరని నిర్ణయించెదిరా, శివుఁడనో మాధవుఁడనో అనుట సుగమముకదా. కావ్యేషు నాటకం రమ్యమనుట యేల? శ్రవ్యప్రబంధముకన్న దృశ్యప్రబంధము రాగతాళాభినయములచే ప్రజాబాహుళ్యమునకు తెలియఁజెప్పుటలో సులభతరమగుటనే. తుదకెట్లైనను పరమానందమును పండితపామరుల కీరీతి పంచిపెట్టునది సంగీతము. ఆలోచన చేసి ఆలసించినఁగాని ఆనందమునుఁ గలుగఁజేయనిది సాహిత్యము. ఐననిది చిరతరముకదా. కనుకనే నెలతక్కువ పిల్లల వలె కాఁబోక, సరస్వతీ స్తనద్వయమగు సంగీతసాహిత్యములను స్తన్యములగ్రోలి సరియగు పుష్టిగలిగి మానవుఁడు వర్ధిల్లునుఁ గాక.

మాణిక్య వీణాముపలాలయంతీం మదాలసాం మంజుల వాగ్విలాసాం" అని మనసా స్మరించి

సామాంపాతు సరస్వతీ భగవతీ నిశ్శేష జాడ్యాపహా యని వాంఛించుటలో పరమార్థ మిదియే.

అవును. 'భారతీదేవి ముంజేతి పలుకుచిలుక' వరికని కవిసార్వభౌముఁ డుద్దేశించెనో! వారెట్టి మహానుభావులో!

అటుగాక సంస్కృత మేకొంతయో చదివికొని సుమతి శతకము కుమారీశతకము నైన చదువక తెలుగు పండితులగు వారివలె, నింగ్లీషుబడులలో పట్టభద్రులై గీర్వాణాంధ్రములను నలిపివైచి అల్లరికవిత్వముచెప్పు నధికులవలె నగచాట్లుపెట్టక, తాముపడక, ఏకస్తనదుగ్ధపానప్రాప్తిని అసంపూర్ణావయవ వృద్ధిగలవారగుటయు తమతమపూర్వజన్మకృతపాపఫలమేయని యాత్మవితర్కము గలవారై, సంగీతమురాని సాహిత్యకారులు గాక, సాహిత్య శూన్యులగు సంగీత విద్వాంసులుగాక యుభయామృతపానపుష్టి నభిలషించి శ్రేయోభివృద్ధులందుదురుగాక. ఇదే అక్షరాభ్యాసమునాఁడు మనచే చదివించి పఠింపఁజేసినది.

సరస్వతి నమస్తుభ్యం, వరదే కామరూపిణి,
విద్యారంభం కరిష్యామి, సిద్ధిర్భవతు మే సదా.

రాజమండ్రి శ్రీ అద్దేపల్లి లక్ష్మణస్వామినాయఁడుగారి సరస్వతీ పవర్ ప్రెస్ నందు, 65 వ పేజీ మొ॥ 102 వరకు ముద్రించడమైనది 9238—35.